
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 6 ఫిబ్రవరి 2025



త్రిషకు జ్ఞాపికను అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

భారత క్రికెటర్ త్రిషకు
రూ.కోటి నజరానా

- అభినందించిన సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి, ఎంపీ, ఎమ్మెల్యేలు

భద్రాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కౌలాలంపూర్‌లో జరిగిన ప్రపంచకప్ అండర్-19 టీ20 పోటీల్లో భారత్ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించిన భద్రాచలానికి చెందిన గొంగడి త్రిషకు రూ.కోటి నజరానాను ముఖ్యమంత్రి ఎనముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో బుధవారం క్రికెటర్ త్రిష, ఆమె తండ్రి జీవీ రాంరెడ్డిలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. త్రిషను సీఎం అభినందిస్తూ శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రపంచకప్‌లో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబర్చి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలవడమే కాకుండా జట్టు విజయానికి మూలస్థంభంగా త్రిష నిలవడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర పేరు ప్రతిష్ఠలు మరింతగా ఇనుమడింపజేయాలన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.కోటి నజరానాను ప్రకటించారు. అలాగే రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు పోరిక బలరాంనాయక్, రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, యశస్వినిరెడ్డి, నీటిపారుదల శాఖ కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారిలు సైతం త్రిషను అభినందించారు.

'రైతు భరోసా'
షురూ...

- తొలుత ఎకరం భూమి ఉన్న రైతులకు వర్తింపు
- ఖాతాల్లో డబ్బులు జమ అవుతుండటంతో హర్షాతిరేకాలు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతుల ఖాతాల్లో 'రైతుభరోసా' డబ్బులు జమ అవుతున్నాయి. ఇటీవల పైలట్ గ్రామాల్లో రైతుభరోసా డబ్బులు జమ అయిన విషయం విదితమే. బుధవారం నుంచి అందరి రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఖమ్మం జిల్లాకు రూ.58.22 కోట్లు, భద్రాద్రి జిల్లాకు రూ.45.68 కోట్లు జమకానున్నాయి. తొలుత ఒక ఎకరా వున్న రైతులకు జమ చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 1,04,995 మంది రైతులకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 38,536 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. అధికారులు రైతుల ఖాతాల్లో నగదును జమ చేసే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. తమ ఖాతాల్లో 'రైతుభరోసా' డబ్బులు జమ అవుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరంపైన వున్న రైతులకు కూడా త్వరలోనే డబ్బులు జమ అవుతాయని అంటున్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఉమ్మడి జిల్లాలో అధికార కాంగ్రెస్‌కు పెద్ద పరీక్షగా మారనున్నాయి. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన ఆ పార్టీ ప్రజాప్రతినిధుల పనితీరుకు పంచాయతీ ఎన్నికలు కొలమానికంగా నిలవబోతున్నాయి. దాంతో ఇప్పటినుంచే మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీ కేడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేస్తున్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ పంచాయతీ ఎన్నికలకు కేడర్‌ను సంసిద్ధం చేస్తున్నారు. ఎమ్మెల్యే కూడా తమ నియోజకవర్గాల పరిధిలో అంతర్గతంగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బహిరంగ సమావేశాలు నిర్వహించకుండా పెళ్లిళ్లు, దశదినకర్మలు, అన్నప్రాసనలు, ఓణీల ఫంక్షన్లు, ఇలా వేడుక ఏదైనా ఆహ్వానం అందుకొని మంత్రులు, ఎమ్మెల్యేలు పర్యటనలు సాగిస్తున్నారు.



'స్థానిక' ఎన్నికల సవాల్

- జిల్లా కాంగ్రెస్‌లో వర్గపోరు గుబులు
- ఆధిపత్యం కోసం ముగ్గురు మంత్రుల పట్టు
- వర్గాలుగా విడిపోయిన కేడర్
- అసంతృప్తులను చేరదీసే వ్యూహంలో బీఆర్ఎస్
- అప్రమత్తం కాకపోతే పల్లెపోరులో దెబ్బతినే ప్రమాదం

అధికార పార్టీకి పరీక్షగా 'పంచాయతీ' ఎన్నికలు

ఖమ్మం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ఎలా ఉన్నా.. అధికార పార్టీలోని వర్గ విభేదాలు ఆ పార్టీ శ్రేణులను భయపెడుతున్నాయి. బయటికి కనిపించకపోయినా అంతర్గతంగా జిల్లా కాంగ్రెస్‌లో వర్గపోరు తీవ్రంగానే నడుస్తోంది. మంత్రుల నియోజకవర్గాలతో పాటు ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ పార్టీ కేడర్ తలోదారి అన్నట్టు చీలి ఉంది. పాత కాంగ్రెస్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి వర్గం, మంత్రులు తుమ్మల, పొంగులేటి వర్గం, రాజ్యసభ సభ్యురాలు రేణుక వర్గంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోంది. నేతలు వచ్చినప్పుడు అంతా ఒక్కటే అన్నట్టు కనిపిస్తున్నా.. గ్రామస్థాయి పదవులు, పనుల విషయంలో ఎవరికివారు అన్నట్లు ఉంటున్నారు. ఈ క్రమంలో ఎన్నికలు వచ్చినప్పుడు ప్రత్యర్థి వర్గాలను దెబ్బతీసేలా ఎదురు చూస్తున్నట్టుగా జిల్లా కాంగ్రెస్‌లో వాతావరణం నెలకొని ఉంది.

బీఆర్ఎస్ వ్యూహం

కాంగ్రెస్‌లో వర్గపోరును బీఆర్ఎస్ సద్వినియోగం చేసుకోవాలనే వ్యూహంతో అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో తమకు అనుకూలమైన వర్గాలతో ముందుగానే చేతులు కలుపుతున్నారు. మధిరలో డిప్యూటీ సీఎం భట్టికి వ్యతిరేకంగా ఉన్న కాంగ్రెస్ గ్రూపు నేతలతోనూ ఖమ్మంలో మంత్రి తుమ్మలకు వ్యతిరేకంగా ఉన్న వర్గంతోనూ, కొందరు మంతనాలు సాగిస్తున్నట్టు సమాచారం. పాలేరులోనూ మంత్రి పొంగులేటికి వ్యతిరేకంగా వామపక్ష పార్టీల నేతలతో బీఆర్ఎస్ మంతనాలు సాగిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా నిర్వహించే పంచాయతీ ఎన్నికల్లో స్థానిక (మిగతా 6వ పేజీలో)

నేడు ఎమ్మెల్యేలతో
సీఎం ముఖాముఖి

- స్థానిక సంస్థల ఎన్నికలే అజెండా
- కులగణన, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై అవగాహన

ఖమ్మం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాబోతున్న గ్రామ, మండల, జిల్లా పరిషత్ స్థానిక సంస్థలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో ముఖాముఖి కార్యక్రమం గురువారం నిర్వహించబోతున్నారు. ఖమ్మంతో పాటు మరికొన్ని జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పార్టీవర్గాలు పేర్కొన్నాయి. ముందుగా ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో (మిగతా 6వ పేజీలో)

మైనర్లకు వాహనాలిస్తే
పేరెంట్స్‌పై కేసులు

ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు



ఖమ్మంక్రైం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టిపెట్టామని, మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. మైనర్లు అధికసంఖ్యలో పట్టుబడుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేసినట్టు తెలిపారు. బుధవారం వాహనాల తనిఖీ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మద్యం మత్తులో వాహనాలను నడపడం ఒకటయితే ర్యాష్ డ్రైవింగ్ మరొకటి అన్నారు. మైనర్లు బైక్‌లు, కార్లు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. గతంలో మైనర్ డ్రైవింగ్ చేస్తూ పోలీసు వారికి పట్టుబడితే జరిమానా వేసి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చామని, ఇక నుంచి డ్రైవింగ్ చేస్తున్న మైనర్ల వాహనాలు సీజ్ చేసి వారితోపాటు వారి తల్లిదండ్రులను న్యాయస్థానంలో హాజరుపరుస్తామని తెలిపారు. కోర్టు శిక్ష లేదా జరిమానా విధించే అవకాశం ఉంటుందన్నారు. కొందరు యువకులు అధిక శబ్దం సైలెన్సర్లు మార్చి పాదచారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు.

యాసంగి సాగుపై
డిజిటల్ సర్వే

- ఎవరు ఏ పంటలు సాగు చేస్తున్నారో తేలనున్న లెక్క
- ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లకు ఈ లెక్కే ఆధారం



డిజిటల్ సర్వే చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారి

ఖమ్మం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): యాసంగి పంటలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో వ్యవసాయశాఖ సాగుపై సర్వే ముమ్మరంగా నిర్వహిస్తోంది. సర్వే నెంబరు, సాగుభూమి, వేసిన పంట, రైతు వివరాలతో డిజిటల్ సర్వే నిర్వహిస్తున్నారు. యాసంగి కింద జిల్లాలో వరి, మొక్కజొన్న, కంది, పెసర, మినుము తదితర పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 5లక్షల ఎకరాల్లో యాసంగి కింద పంటలు సాగు చేస్తున్నారు. అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా 3 లక్షల ఎకరాలపైగా వేసవిలో పంటల సాగు జరుగుతోంది.

ప్రస్తుతం వరినాట్లు వేస్తుండగా మరోవైపు మొక్కజొన్న పంట కూడా ఏపుగా పెరుగుతోంది. కంది, పెసర, మినుము వంటి పప్పు ధాన్యాలు, ఇతర కూరగాయలు, నూనెగింజల పంటలు జిల్లాలో సాగు చేస్తున్నారు. యాసంగి కింద ఇప్పటికే 2లక్షల 80వేల ఎకరాలకు గాను లక్షా74వేలఎకరాల్లో వరి పంట వేశారు. మొక్కజొన్న లక్షా20వేల ఎకరాలు లక్ష్యంకాగా 92వేల ఎకరాలు, పెసర కంది వంటి పంటలు మరో 15వేల ఎకరాల్లో వేశారు. సుమారు (మిగతా 6వ పేజీలో)



మమేకం



మహిళా ప్రాంగణంలో కలెక్టర్...

ఉపాధి అవకాశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. నగరంలోని టేకులపల్లి దుర్గాబాయి మహిళా ప్రాంగణాన్ని బుధవారం ఆయన సందర్శించారు. మహిళలకు అందిస్తున్న వృత్తి విద్య, ఉపాధి శిక్షణ కోర్సులను తెలుసుకున్నారు. అనంతరం శిక్షణార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం ఖానాపురం హవేలి

బాలికల గురుకులంలో పీవో...

భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ దుమ్ముగూడెం మండలంలోని కేరేగుబల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. నూతన మెనూ అమలు తీరును విద్యార్థినుల నుంచి అడిగి తెలుసుకోవడంతో పాటు వారితో కలిసి భోజనం చేశారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించి భవిష్యత్తుకు బాట వేసుకోవాలని సూచించారు.

-ఆంధ్రజ్యోతి, దుమ్ముగూడెం

కోళ్ల మృత్యువాతకు
కారణాలేమిటి..?

- శ్యాంపిల్స్ పరీక్ష ఫలితాలు వచ్చిన తర్వాతే నిర్ధారణ
- వైరస్ రకంపై కొనసాగుతున్న అస్పష్టత
- జాగ్రత్తలు అవసరం అంటున్న పశు సంవర్ధకశాఖ ఏడీ



సత్తుపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అంతుబట్టని వైరస్ కారణంగా పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోతున్న విషయం విదితమే. కోళ్లు పెద్ద సంఖ్యలో చనిపోతున్న విషయంపై పశుసంవర్ధక శాఖ రంగంలోకి దిగి కోళ్ల ఫారాలను వైద్యులు పరీక్షించారు. వీరితోపాటు హైదరాబాద్ నుంచి వెటర్నరీ బయలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అధికారులు కూడా వచ్చి ఇటీవల చనిపోయిన కోళ్ల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. అక్కడ పరీక్ష అనంతరం కోళ్లకు (మిగతా 6వ పేజీలో)

ఘొల్లుమన్న మల్లుపల్లి



మృతిచెందిన తండ్రి వీరయ్య, కుమారుడు రాము (ఫైల్)



శ్రీనివాస్ (ఫైల్)

హైదరాబాద్‌లో గోడ, మట్టిదిబ్బలు విరిగిపడిన ఘటనలో ముగ్గురి దుర్మరణం

- మృతుల్లో తండ్రి, కుమారుడు, మరో బంధువు
- మృతులందరూ మల్లుపల్లి వాసులే...
- గ్రామంలో తీవ్ర విషాదం
- మృతదేహాలను తీసుకు రావడానికి తరలివెళ్లిన గ్రామస్థులు

కొణిజర్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్న కుటుంబాలు ఛిద్రమయ్యాయి. ఓ అపార్ట్‌మెంట్‌కు సంబంధించి సెల్లార్‌లో పని చేస్తున్న వారిపై గోడ, మట్టిదిబ్బలు పడటంతో అక్కడకు అక్కడే ముగ్గురు మృతిచెందారు. వారిలో తండ్రి, కుమారుడు, మరో బంధువు, వరుసకు మృతుడి మేనల్లుడు వున్నారు. వీరంతా పనులు కోసం హైదరాబాద్ వెళ్లి వివిధ రకాల కూలిపనులు చేస్తుంటారు. ఒకేఇంట్లో తండ్రి, కొడుకు, మేనల్లుడు మృతిచెందటంతో స్వగ్రామం అయిన కొణిజర్ల మండలం మల్లుపల్లి గ్రామంలో విషాదం నెలకొంది.

మల్లుపల్లిలో విషాదం

కొణిజర్ల మండలం మల్లుపల్లి గ్రామంలో హైదరాబాద్‌లో బుధవారం జరిగిన సంఘటనతో విషాదం నెలకొంది. పొట్టకూటి కోసం వెళ్లిన వారిపై మట్టిదిబ్బలు కూలటం వారు మట్టిదిబ్బలు కింద పడి చనిపోవడం గ్రామంలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. గ్రామానికి చెందిన అళ్లకుంట వీరయ్య(45) అతడి కుమారుడు అళ్లకుంట రాము(21), బంధువు ముద్దంగుల శ్రీనివాస్(20).. వీరంతా హైదరాబాద్‌లో మూడేళ్ల నుంచి అక్కడే కుటుంబాలతో ఉంటూ కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పని ఎక్కడ దొరికితే అక్కడే వేరువేరుగా పనులకు వెళ్లేవారు. ఈ క్రమంలో వీరయ్య, రాము, శ్రీనివాస్ హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో పని చేసేందుకు వెళుతున్నారు. సెల్లార్‌లో పని చేస్తుండగా వీరి పక్కనే ఉన్న గోడకూలి మట్టి దిబ్బలు వీరిపై పడ్డాయి. దీంతో జేసీబీ ద్వారా మట్టిని వీరిపై నుంచి తొలగించి చూసే సరికి వారి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. విషయం తెలుసుకున్న బంధువులు మల్లుపల్లి గ్రామం నుంచి హైదరాబాద్‌కు వెళ్లారు. గ్రామంలో ముగ్గురు చనిపోవడంతో గ్రామం విషాదంలో మునిగిపోయింది.

కుటుంబాల నేపథ్యం

హైదరాబాద్ ఘటనలో మృతి చెందిన అళ్లకుంట వీరయ్యకు (మిగతా 6వ పేజీలో)

బడ్జెట్‌పై భగ్గుమన్న
అఖిలపక్షం

నిరసన ర్యాలీ, బడ్జెట్ ప్రతుల దహనం



బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న అఖిలపక్ష నాయకులు

ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రైతులు, కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని ఆగ్రహిస్తూ అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల సంయుక్త కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలో ఆందోళన నిర్వహించారు. కేంద్ర ఆర్థిక మంత్రి పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ, కార్మిక రంగాలను దెబ్బతీసేవిగా ఉన్నాయని ఆరోపిస్తూ ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ, కాంగ్రెస్ కిసాన్ సెల్, ఏఐకెఎస్, ఏఐపీకేఎస్‌ల ఆధ్వర్యంలో పెవిలియన్ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన ర్యాలీ జరిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు బొంతు రాంబాబు, ఐఎఫ్‌టీయూ నాయకులు పుల్లయ్య, శ్రీను, ఏఐటీయూసీ నాయకులు సింగు నరసింహారావు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగానికి వ్యతిరేకంగా ఉన్న నల్ల చట్టాలను రద్దు చేయాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



కేయూ వీసీని కలిసిన బీఈడీ కళాశాల ప్రతినిధి బృందం

భద్రాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ప్రభుత్వ గిరిజన బీఈడీ కళాశాల ప్రతినిధి బృందం బుధవారం కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారు యూనివర్సిటీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్సీరెడ్డి, కిషోర్, ధర్మ, వెంకటేశ్వర్లు, సురేష్‌బాబు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కోల్ ఇండియా క్రికెట్‌లో సింగరేణి జైత్రయాత్ర

సెమీ ఫైనల్‌కు చేరిన జట్టు

రుద్రంపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరుగుతున్న కోల్‌ఇండియా క్రికెట్ పోటీల్లో సింగరేణి జట్టు చక్కటి ప్రదర్శన కనబరిచి సెమీ ఫైనల్‌కు చేరింది. కోల్ ఇండియా పరిధిలోని పది బొగ్గు సంస్థల జట్లు ఈ పోటీల్లో తలపడుతున్నాయి. 4న ఎంపీఎల్‌తో జరిగిన మ్యాచ్‌లో సింగరేణి జట్టు విజయం సాధించింది. అదే విధంగా బుధవారం ఎన్‌పీసీఎల్‌తో జరిగిన మ్యాచ్‌లో సింగరేణి జట్టు 3 వికెట్ల తేడాతో గెలుపొందినట్టు జీఎం (పర్సనల్) వెల్ఫేర్ కవితానాయుడు తెలిపారు. వరుసగా రెండు విజయాలు సాధించి సింగరేణి జట్టు సెమీ ఫైనల్‌కు చేరుకుందన్నారు.

క్లినికల్ అప్రెంటిస్‌షిప్ శిక్షణకు

15లోగా దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫిమేల్) ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఓ సంవత్సరం క్లినికల్ అప్రెంటిస్‌షిప్ శిక్షణకు ఈ నెల 15లోగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు తెలిపారు.

ఈ శిక్షణ ఖమ్మం నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అందిస్తున్నట్టు తెలిపారు. శిక్షణకు ఎంపికైన వారు రూ.1000ల ఆస్పత్రి పేరున డీడీ రూపంలో చెల్లించాలని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకుని ఎంపిక కాని వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల వారు బయోడేటా ఫారంతో పది రూపాయల పోస్టల్ స్టాంప్ అతికించి సొంత చిరునామా కవర్, సర్టిఫికెట్లు జిరాక్స్‌లతో పాటు అందించాలని తెలిపారు.

ప్రత్యేక మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలి

- కేంద్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా మిర్చిని కొనుగోలు చేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్
- సీపీఎం ఆధ్వర్యంలో మార్కెట్ యార్డుల సందర్శన



మార్కెట్ చైర్మన్ హన్మంతరావుతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి పంటకు ప్రత్యేక మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి అప్పులు చేసి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదని పసుపు బోర్డు తరహాలో మిర్చికి బోర్డు ఏర్పాటు చేస్తే రైతులకు మద్దతు ధరలు దక్కే అవకాశం ఉందని ఆయన అన్నారు. ప్రస్తుత ఓపెన్ మార్కెట్‌లో మిర్చి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా రైతులను తీవ్రంగా నష్ట పరుస్తున్నారని ఆరోపించారు. ఈ ఏడాది మిర్చి సాగుకు పెట్టుబడి ఖర్చులు గణనీయంగా పెరిగాయని, అదేవిధంగా దిగుబడులు తగ్గాయని, మార్కెట్లో పంట అమ్ముదామంటే ధరలు పడిపోయాయని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర చట్టం అమలు చేయాలని, మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా మిర్చిని కొనుగోలు చేయాలి ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు యార్డుల్లో తిరుగుతూ పలువురు రైతులతో మాట్లాడి ధరలు ఎలా దక్కుతున్నాయని ఆరా తీశారు. అనంతరం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్‌లతో మాట్లాడి రైతులకు గిట్టుబాటు ధరలు దక్కే విధంగా మార్కెట్ కమిటీ చర్యలు తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, సీపీఎం నాయకులు ఎర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేష్, మీరా సాహెబ్, భూక్యా శ్రీనివాసరావు, బండారు యాకయ్య, వజినేపల్లి శ్రీనివాస్, బండారు వీరబాబు, బజ్జూరి రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

ట్రైకార్ సమావేశంలో నియోజకవర్గ సమస్యలు

ఇల్లెందు, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు నియోజకవర్గంలో గిరిజన సంక్షేమ పథకాలు మరింత విస్తృతంగా అమలు చేయాలని, నిరుద్యోగ గిరిజన యువతి యువకులకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు సహకరించాలని గిరిజన సహకార ఆర్థిక సేవా సంస్థ (ట్రైకార్) సమావేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరిగిన ట్రైకార్ సమావేశంలో మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, వివిధ జిల్లాలకు చెందిన గిరిజన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ ఐదేళ్లుగా ఇల్లెందు నియోజకవర్గంలో గిరిజన సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు కాలేదన్నారు. స్వయం ఉపాధి పథకాలు, అర్హత ఉన్నా గిరిజన విద్యావంతులకు అందలేదన్నారు. ట్రైకార్ ఆధ్వర్యంలో నిరుద్యోగ గిరిజన విద్యావంతులకు ప్రత్యేక శిక్షణలను అందించి స్వయం ఉపాధి పథకాలు అందించాలని, గిరిజన నియోజకవర్గమైన ఇల్లెందుకు ఇందిరమ్మ పక్కా గృహాల నిర్మాణంలో ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

కనకన్నా.. బాగున్నావా...

ఎమ్మెల్యే కనకయ్యకు సీఎం రేవంత్ ఆత్మీయ పలకరింపు

ఇల్లెందు, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి): కనకన్నా బాగున్నావా.. నియోజకవర్గం ఎలా ఉంది. ప్రజలంతా బాగున్నారా.. అంటూ ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆత్మీయంగా పలకరించారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే కోరం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం భుజాలపై చేతులు వేసి దగ్గరకు తీసుకుని పలకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య తన నియోజకవర్గం పూర్తిగా గిరిజన ప్రాంతమని, సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ఇందిరమ్మ గృహాల సంఖ్య పెంచాలని కోరారు. ఈ మేరకు సీఎం సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, తదితరులు ఉన్నారు.

కొత్త బొగ్గు బ్లాకులకు ప్రైవేటు కంపెనీల

క్యూ

11వ రౌండ్ వేలంలో బిడ్లు దాఖలు చేసిన 46 కంపెనీలు

ఇల్లెందు, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ రాష్ట్రాల్లోని నూతన బొగ్గు గనులను దక్కించుకోవడానికి ప్రైవేటు కంపెనీలు పోటీ పడుతున్నాయి. 11వ రౌండ్ టెండర్ల ప్రక్రియలో 46 కంపెనీలు ఆన్‌లైన్లో 70, ఆఫ్‌లైన్లో (సీల్డ్ టెండర్లు) 72 బిడ్లు దాఖలు చేయడం గమనార్హం. 11వ పర్యాయం చేపట్టిన కమర్షియల్ బొగ్గు బ్లాకుల వేలంలో మొదట 15 నూతన ప్రభుత్వ, ప్రైవేటు రంగ కంపెనీలు సైతం బిడ్లు దాఖలు చేశాయి. వీటితోపాటు ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా అనుబంధ బొగ్గు ఉత్పాదక సంస్థలు సైతం వివిధ రాష్ట్రాల్లోని బొగ్గు బ్లాకులకు టెండర్లు దాఖలు చేశాయి. కేంద్ర ప్రభుత్వం 11వ పర్యాయం నిర్వహిస్తున్న వేలం ప్రక్రియలో మొత్తం 27బొగ్గు బ్లాకులకు టెండర్లు పిలవగా 15బొగ్గు బ్లాకులకు ఏకంగా 65టెండర్లు దాఖలయ్యాయి. ఈ వేలం ప్రక్రియలో జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 27బొగ్గు బ్లాకులు ఉన్నాయి. రూ.1446 కోట్ల వార్షిక ఆదాయం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 27బొగ్గు బ్లాకులకు టెండర్ల ప్రక్రియ చేపట్టగా బిడ్లుదాఖలు చేసిన కంపెనీల్లో కోల్ ఇండియా అనుబంధ వెస్టన్ కోల్ ఫీల్డ్స్, జిందాల్ పవర్, భారత్ అల్యూమినియం, జేఎస్ డబ్ల్యూ స్టీల్స్, అదాని కంపెనీ, ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జార్ఖండ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ మైనింగ్, ఒరిశా ఎల్లోఎస్ స్టీల్స్, ఒరిశా మెటికిల్స్ తదితర కంపెనీలు ఉన్నాయి. కంపెనీల సామర్థ్యాల పరిశీలన అనంతరం ఎలక్ట్రానిక్ యాక్షన్ ద్వారా బొగ్గు బ్లాకుల కేటాయింపులు జరుపుతుంది.

16 నుంచి రాజీవ్ ట్రోఫీ

క్రికెట్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 5: ఖమ్మం టౌన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో రాజీవ్ ట్రోఫీ ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మతిన్ ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గ్రామీణ క్రీడాకారులు వారి మండల జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 16మంది టీమ్‌గా పేర్లను ముందుగా పంపాలని కోరారు. వివరాలకు 9346624241 నెంబరును సంప్రదించాలని కోరారు.

ఘొల్లుమన్న మల్లుపల్లి

(5వ పేజీ తరువాయి)

భార్య రాధమ్మ, ఇద్దరు కుమారులు శ్రీను, రాము ఉన్నారు. గ్రామంలో వారికి చిన్నపాటి రేకుల ఇల్లు ఉంది. పనుల కోసం గ్రామం వదిలి హైదరాబాద్ వెళ్లి అక్కడే గత మూడేళ్ల నుంచి కూలిపనులు చేసుకుంటున్నారు. వీరయ్య, చిన్నకుమారుడు రాము ఇద్దరు ఎల్బీనగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో సెల్లార్‌లో మట్టి పనులకు వెళ్లారు. వారితో పాటు మృతుడి భార్యకు మేనల్లుడైన గ్రామానికి చెందిన ముద్దంగుల క్రిష్ణ, తిరుపతమ్మల చిన్నకుమారుడు శ్రీనివాస్ కూడా వెళ్లాడు. వీరయ్య, రాము, శ్రీనివాస్(వాసు) ముగ్గురు పని చేస్తుండగా మట్టిదిబ్బలు కూలి వీరిపై పడటంతో అక్కడకు అక్కడే మృతి చెందారు. మృతి చెందిన వారిలో శ్రీనివాస్ తల్లి తిరుపతమ్మ ఏడాది క్రితం చనిపోయింది. అప్పటి నుంచి శ్రీనివాస్, అతడి తమ్ముడు శ్రీమంతు ఇద్దరూ.. మేనత్త, మేనమామ అయిన వీరయ్య, రాధమ్మల వద్దనే ఉంటూ పనులకు వెళుతున్నారు. వీరంతా మూడేళ్ల క్రితం నుంచి హైదరాబాద్‌లో వెళ్లి ఎవరికి ఎక్కడ పనిదొరికితే అక్కడకు వెళ్లి పని చేసుకుంటున్నారు. ఇక ఆళ్లకుంట వీరయ్య కుటుంబానికి స్వగ్రామంలో రేకులతో కూడిన తడికల ఇల్లు మాత్రమే ఉంది.

కోళ్ల మృత్యువాతకు

కారణాలేమిటి..?

(5వ పేజీ తరువాయి)

సోకిన వైరస్ ఏ రకమైనది నిర్ధారణ కానుంది. ల్యాబ్ రిపోర్టు వచ్చిన తరువాత తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు ఇచ్చేందుకు వైద్యులు సిద్ధంగా ఉన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

షెడ్లలో ప్రస్తుతం పెరుగుతున్న కోళ్ల పెంపకం విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ చెప్పారు. కోళ్లలో రోగ నిరోధక శక్తి పెరిగే విధంగా విటమిన్స్, మినరల్స్ అందించాలని సూచించారు. అవసరమైనప్పుడు యాంటీబయాటిక్స్ కూడా ఇవ్వాలన్నారు. కోళ్ల ఫారంలో పరిశుభ్రత చాలా అవసరం అని తప్పనిసరిగా శుభ్రత పాటించాల్సి ఉంటుందన్నారు. ఫారం షెడ్లలోకి కొత్త వారు వెళ్లకూడదన్నారు. తరచూ వెళ్లే వారు కూడా కాళ్లు, చేతులు కడిగిన తరువాత మాత్రమే వెళ్లాలని, కోళ్ల ఫీడింగ్, డ్రింకింగ్ పాత్రలను రెండు పర్యాయాలు శుభ్రం చేయాలని సూచించారు. ప్రస్తుతం పగలు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, రాత్రి సమయంలో చల్లగా ఉంటోందన్నారు. వాతావరణంలో మార్పులు గమనిస్తూ కోళ్లకు రక్షణగా చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన కోళ్లను గోతిలో బ్లీచింగ్ చల్లి పూడ్చిపెట్టాలని సూచించారు. లేకుంటే వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు.

'స్థానిక' ఎన్నికల సవాల్

(5వ పేజీ తరువాయి)

వ్యూహాలకు పదును పెట్టే క్రమంలో కాంగ్రెస్‌లోని భిన్న వర్గాల నేతలు ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నేతలతో ముందస్తు స్నేహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇతర నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా ఉన్న కాంగ్రెస్ అసంతృప్తులను వలలో వేసుకునేందుకు బీఆర్‌ఎస్ నాయకులు వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. బహిరంగంగా కార్యక్రమాలు చేయకుండా అసంతృప్త నేతలను హైదరాబాదుకు పిలిపించుకొని చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా "అవసరమైతే మేం వెనక్కితగ్గుతాం మీరే అభ్యర్థిని నిలపండి" అంటూ బీఆర్ఎస్ నేతలు భరోసా ఇస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు అప్రమత్తం కాకపోతే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచే అనేకచోట అనూహ్యంగా దెబ్బతినే ప్రమాదం పొంచి ఉంది.

నేడు ఎమ్మెల్యేలతో సీఎం ముఖాముఖి

(5వ పేజీ తరువాయి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుకోసం అనుసరించాల్సిన వ్యూహం, ఏడాది కాలంగా నియోజకవర్గాల్లో చేపట్టిన కార్యక్రమాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుకోసం చేయాల్సిన కసరత్తుతోపాటు కులగణన సర్వే, రిజర్వేషన్ల కేటాయింపులు తదితర అంశాలపైనా ఎమ్మెల్యేలకు అవగాహన కలిపించబోతున్నారు. జిల్లాకు చెందిన అందరు ఎమ్మెల్యేలు మంత్రులు ఈ ముఖాముఖి కార్యక్రమానికి హాజరుకానున్నారు. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఒక్కొక్కరితో మాట్లాడే అవకాశం ఉందని తెలిసింది. ఇటీవల పలు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పనులు కావడం లేదని మంత్రులు ప్రాధాన్యత అధికంగా ఉంటుందని జిల్లా అధికారులు, నియోజకవర్గ అధికారులు తమను పట్టించుకోవడంలేదని బిల్లులు కూడా కావడంలేదంటూ సమావేశాలు నిర్వహించిన విషయం విదితమే. ఎమ్మెల్యేల్లో ఉన్న అసంతృప్తిని పసిగట్టిన ముఖ్యమంత్రి ఒక్కొక్కరితో మాట్లాడే అవకాశం ఉందని తెలిసింది. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఎమ్మెల్యేల ప్రమేయం లేకుండా మంత్రులే తమ మనుషులకు కాంట్రాక్టు పనులు ఇవ్వడం, ఇసుక క్వారీల్లో జోక్యం చేసుకోవడం, వారి అనుచరులకే కట్టబెట్టడం, నియామక పదవుల్లోనూ మంత్రుల ప్రమేయం ఉండడం, ఎమ్మెల్యేలకు స్వతంత్రత తగ్గుతుందన్న భావన కలుగుతుంది. రిజర్వుడు నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి అధికంగా ఉన్నట్టు పార్టీ అధిష్టానం గుర్తించినట్టు సమాచారం. నియోజకవర్గ స్థాయి అధికారులు, బదిలీలు, పోలీసు, రెవెన్యూ తదితర శాఖల పోస్టింగ్‌లు, ప్రభుత్వ కమిటీల నియామకం ఆయా నియోజకవర్గాల్లోని కాంట్రాక్టు అభివృద్ధి పనులు, పలు గ్రావెల్, ఇసుక వంటి క్వారీల్లో మంత్రుల మనుషులు చేజిక్కించుకుంటున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లే ఇప్పుడు పనులు చేజిక్కించుకోవడం, బీఆర్‌ఎస్‌లో పెత్తనం సాగించిన కాంట్రాక్టర్లు ఇప్పుడు కూడా ఇసుక వ్యాపారంలో కాంట్రాక్టు పనుల నిర్వహణలో చక్రం తిప్పుతున్నారు. ఇది నియోజక వర్గస్థాయిలో కొంత అసంతృప్తి ఉంది. ముఖ్యమంత్రి రహస్యంగా ఎమ్మెల్యేలతో సమావేశం జరిపితే స్థానిక పరిస్థితులు సీఎం దృష్టికి వెళ్లే అవకాశాలున్నాయి.

భద్రాద్రి జిల్లాలో ఇసుకమాఫియాపై

సీఎం రేవంత్ ఉక్కుపాదం

జిల్లాలోని 17ఇసుక ర్యాంపులు నిలిపివేయాలని సీఎంవో ఆదేశం

కొత్తగూడెం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈమేరకు సీఎంవో జిల్లాలో కొనసాగుతున్న 17 ఇసుక ర్యాంపులను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి అనుచరులు ఇసుక రీచ్‌లను నడిపిస్తుండటంతో అధికార యంత్రాంగం ఇసుకరీచ్‌ల నిర్వహకులకు పూర్తిస్థాయిలో సహకరిస్తుండటంతో జిల్లాలో టీఎస్ఎండీసీ ద్వారా ఇసుక అమ్మకాలపై ప్రభుత్వానికి నవంబరు 24 నాటికి రూ.38 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకరీచ్‌ల యాజమాన్యం వ్యవహరిస్తుండటం, వే బిల్లులు లేకుండా అక్రమ రవాణా చేయడంతో ప్రభుత్వ ఖజానాకు భారీమొత్తంలో గండి పడింది. సీఎం దృష్టికి జిల్లాలో ఇసుక రీచ్‌ల నిర్వహణ ఫిర్యాదులు రావడంతో ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు.

మిలిగిన ధాన్యం కొనుగోళ్లకు

సర్కారు గ్రీన్ సిగ్నల్

వైరా ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలోని విప్పలమడక, కనకగిరి సిరిపురం గ్రామల్లో రైతులవద్ద మిగిలిఉన్న దాన్యాన్ని కొనుగోలుచేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. డీసీఎంఎస్ జనరల్ మేనేజర్ సందీప్ బుధవారం రాత్రి ఈ విషయాన్ని ప్రకటించారు. ఖరీఫ్ సీజన్లో రైతుల పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం జనవరి 31వ తేదీ వరకు కొనుగోలు చేయాలని ప్రకటించినప్పటికీ ఈ రెండు గ్రామల్లో 29 వతేదీ వరకే కొనుగోలు నిలిపివేశారు. దాంతో అనేక మంది రైతులు ఆందోళనలో మునిగిపోయారు. రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ రైతులు తమగోడు వెలిబుచ్చారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజను కలిసి రైతుల ఆందోళన విరమించారు. రైతులతో కలిసి నిరసన వ్యక్తంచేశారు. డీసీఎంఎస్ జీఎం సందీప్ దాన్యం కొనుగోళ్లకు అనుమతి కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ ద్వారా విజ్ఞప్తిచేశారు. మంత్రి పొంగులేటి ఆదేశాలతో కలెక్టర్ ముజిమ్మల్ ఖాన్ వ్యవసాయశాఖ కమిషనర్‌తో సంప్రదింపులు జరిపారు. ఎట్టకేలకు రైతులు వద్ద మిగిలిన దాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గురువారం నుంచి దాన్యాన్ని కొనుగోలు చేస్తామని సందీప్ రైతులకు సమాచారం ఇచ్చారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా అధికారులకు రైతులు కృతజ్ఞతలు తలిపారు.


ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకొని

ఆర్థికంగా ఎదగాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని, నైపుణ్యతతో కూడిన వ్యాపారం సృష్టించుకొని మరోకరికి ఉపాధి కల్పించే విధంగా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం నగరంలోని టేకులపల్లి దుర్గాబాయి మహిళా ప్రాంగణాన్ని సందర్శించారు. మహిళలలకు అందిస్తున్న వృత్తి విద్యా కోర్సులు, ఉపాధి శిక్షణా కోర్సులు టైలరింగ్, ఏఎన్ఎం నర్సింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, టైపింగ్, ట్యాలీ, అకౌంటెంట్, కంప్యూటర్, బ్యూటీషియన్, మగ్గం, తదితర కోర్సుల శిక్షణను పరిశీలించారు.అనంతరం శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులతో మాట్లాడారు. మహిళలకు వృత్తి విద్యా కోర్సుల లో శిక్షణ అందించి వారికి స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో మహిళా ప్రాంగణంలో శిక్షన అందిస్తున్నామన్నారు. ఆడపిల్లలు ఆర్థికంగా గొప్ప స్థాయికి ఎదగటం కోసం కేవలం ఉపాధి కల్పనలోనే కాకుండ వివిధ పోటీ పరీక్షలలో విజయం పాధించటానికి శిక్షణ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. శిక్షణ అనంతరం సబ్సిడీ రుణాలు ఇప్పించేందుకు మహిళా ప్రాంగణం సహకరిస్తుందని అన్నారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఏఎన్ఎం కోర్సులలో రాష్ట్ర స్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన పావని, మనీల లతోపాటు ర్యాంకులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించి సన్మానించి జ్ఞాపికలు అందించారు. స్టడీ మెటీరియల్ అందించారు. ప్రాంగణంలో మౌలిక సదుపాయాలకు కావాలని ప్రాంగణం మేనేజర్ విజేత కోరగా వెంటనే మంజూరు చేశారు. మహిళా ప్రాంగణం మేనేజర్ విజేతను అభినందించి సన్మానించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

మహిళలు స్వశక్తిపై ఎదగాలి: పీవో



చిక్కీ తయారీని పరిశీలిస్తున్న పీవో

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. లక్ష్మీనగరంలోని గిరిజన చిక్కీ యూనిట్‌ను బుధవారం సందర్శించారు. పల్లిపట్టి తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఏడుగురు గిరిజన మహిళలు రూ40లక్షలతో యూనిట్ ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందడం సంతోషకరమన్నారు. రూ24 లక్షల సబ్సిడీ, రూ12 లక్షల బ్యాంకు రుణం, రూ4 లక్షల బెనిఫిషరీ కాంట్రిబ్యూషన్‌తో ఏర్పాటైందన్నారు. అనంతరం కేరేగుబల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నతపాఠశాలను సందర్శించారు. నూతన మెనూ అమలును విద్యార్థినుల నుంచి అడిగి తెలుసుకోవడంతో పాటు వారితో కలిసి భోజనం చేశారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించి భవిష్యత్తుకు మంచి బాట వేసుకోవాలన్నారు. హెచ్ఎం, వార్డెన్, సబ్జెక్టు టీచర్లెవరూ సెలవులు పెట్టవద్దన్నారు. ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఏటీడీవో అశోక్‌కుమార్, ఎస్ఓ ఉదయభాస్కర్, తహసీల్దార్ అశోక్‌కుమార్, హెచ్ఎం సావిత్రి, వార్డెన్ శారదలున్నారు.

యాసంగి సాగుపై

డిజిటల్ సర్వే

(5వ పేజీ తరువాయి)

4లక్షల ఎకరాల వరకు ప్రస్తుతం పలు రకాల పంటలు సాగుచేస్తున్నారు. ఇంకా లక్ష ఎకరాల్లో పంటలు వేయాల్సి ఉంది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వరి , కంది, పెసర, మొక్కజొన్న తదితర పంటలు రెండున్నర లక్షలపైగా ఇప్పటికే వేశారు. మొత్తం ఈపంటలను వ్యవసాయశాఖ ఏఈవోల ఆధ్వర్యంలో డిజిటల్ సర్వేచేస్తున్నారు. రైతుపేరు, పాస్‌పుస్తకం నెంబరు,సర్వే నెంబరు, వేసిన పంటల విస్తీర్ణం, పంటల ఫొటోలు, సమగ్ర సమాచారాన్ని డిజిటల్ సర్వేలో పొందుపరుస్తున్నారు. ఈ సర్వే ఆధారంగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లకు రైతులుపేరిట అనుమతులు లభిస్తాయి. యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో డిజిటల్ సర్వే జాబితాను దృష్టిలో పెట్టుకుని ధాన్యం కొనుగోలుతో పాటు బోనస్‌కూడా ఇవ్వడం జరుగుతుంది.

మొక్కజొన్న కొనుగోలులో మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలకు మొక్కజొన్నలు అమ్మాలన్నా డిజిటల్ సర్వేలో పంట నమోదై ఉండాలి. అలాగే మార్చి ఏప్రిల్‌లో వచ్చే అకాలవర్షాలు, వడగండ్ల వానలకు నష్టం జరిగినా డిజిటల్ సర్వే ఆధారంగా పంటల పరిహారం రైతులకుఅందే అవకాశం ఉంది. ప్రభుత్వం పంటల బీమా పథకం అమల్లోకి తెచ్చేయోచనలో ఉన్నందున డిజిటల్ సర్వేలో నమోదైన పంటలకు క్రాప్ సర్వేను వర్తింపచేయడం, రైతుభరోసా కూడా ఎవరు ఏపంటలు వేశారో, ఖాళీపంటల భూములు లెక్కలు గుర్తించడం, పంటలు వేసిన వారికే సాగు భరోసా అందే అవకాశం ఉంటుంది. జిల్లాలో త్వరితగతిన క్రాప్ డిజిటల్ సర్వే చేపడుతున్నామని, ఏఈఓల ఆధ్వర్యంలో డిజిటల్ సర్వేనడుస్తున్నదని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య తెలిపారు.

గురుకులాన్ని పరిశీలించిన

పీఆర్ కమిషనర్

ఖమ్మం/ వైరా ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వైరా మండలం ముసలమడుగులోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ సృజన, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి భోజనం పెడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినిలతో కలిసి కమిషనర్ సృజన భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో దీక్ష రైనా, డీపీవో ఆశాలత, డిఎస్‌పీవో రాంబాబు, ఎంపీడీవో సరస్వతి, ఎంపీవో జ్యోష్న, ప్రిన్సిపాల్ మాదివిలత తదితర అధికారులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

మహిళను వంచించిన న్యాయవాది

పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

భద్రాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తన భర్తతో కుటుంబ వివాదాల కారణంగా ఒంటరిగా నివసిస్తున్న మహిళను భద్రాచలానికి చెందిన న్యాయవాది భరణి వెంకట కార్తీక్ వంచించిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితురాలి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొంత కాలంగా తన భర్తతో కుటుంబ వివాదాల కారణంగా ఓ మహిళ ఒంటరిగా నివసిస్తున్నారు. ఈ విషయంలో తన భర్తపై చట్టపరంగా పోరాడేందుకు ఆమె న్యాయవాది కార్తీక్‌ను ఆశ్రయించింది. దీంతో న్యాయం జరిగేలా చూస్తానని న్యాయవాది ఆమెతో పేర్కొన్నారు. ఒంటరిగా జీవిస్తున్న బాధిత మహిళను వివాహం చేసుకుంటానని నమ్మించాడు. ఈ నేపథ్యంలో గర్భం దాల్చిన మహిళ పెళ్లి గురించి ప్రస్తావించగా అందుకు కార్తీక్ నిరాకరించాడు. ఈ క్రమంలో ఆమె భద్రాచలం పోలీసులను ఆశ్రయించగా స్టేషన్ హౌజ్ ఆఫీసర్ బరపాటి రమేష్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా సంబంధిత న్యాయవాది కార్తీక్ పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు



మృతుడు షాజహాన్

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం సత్తుపల్లి మండలం తాళ్లమడలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి పట్టణంలోని వెంగళరావునగర్‌కు చెందిన ఎస్‌కే షాజహాన్ (35), ఎస్‌కే ఆసీఫ్ ఓ మాంసం దుకాణంలో పని చేస్తున్నారు. పని నిమిత్తం అశ్వారావుపేట వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. తాళ్లమడలో స్పీడ్‌బ్రేకర్లు దాటిన తర్వాత బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడటంతో అదే సమయంలో వస్తున్న లారీ వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో షాజహాన్ తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడరు. ఆసీఫ్ కుడి చేయి, తలకు తీవ్రగాయాలవ్వగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఎస్ఐ రఘు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మృతునికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని యువకుడి మృతదేహం నగర శివారులోని సాగర్ కాలవలో బుధవారం లభ్యమైంది. స్థానికులు అర్బన్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 30 ఏళ్ల ఉంటుందని పోలీసులు తెలిపారు.

విలేకరికి తీవ్రగాయాలు

అశ్వాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొండికుంట అలుగువాగు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లెలమడుగు గ్రామానికి చెందిన ఓ పత్రిక విలేకరి మిలట్రీ వెంకన్న తీవ్రగాయాల పాలయ్యారు. వెంకన్న తన పొలం దగ్గరనుంచి బైక్‌పై రహదారి ఎక్కుతుండగా, మణుగూరు వైపు నుంచి వస్తున్న మరో బైక్ ఢీకొనటంతో కుడికాలు విరిగిపోయి గాయాల పాలయ్యారు. వెంకన్నను చికిత్స నిమిత్తం భద్రాచలంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

బంగారు ఆభరణాల చోరీ

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ హ్యాండ్‌బ్యాగ్‌లోని రూ.3లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీ జరిగిన సంఘటన బుధవారం సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బుగ్గపాడుకు చెందిన యాచమనేని రాధిక హైదరాబాద్ నుంచి సత్తుపల్లికి చేరుకుని ఆర్టీసీ బస్టాండ్ బుగ్గపాడు వెళ్లేందుకు బస్సు ఎక్కారు. బస్సు ఎక్కిన తర్వాత హ్యాండ్‌బ్యాగ్‌లోని 5కాసుల 4గ్రాముల విలువ కలిగిన హారం, రకాల చెవికమ్మలు దొంగలు అపహరించారని గుర్తించారు. వెంటనే సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ కిరణ్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు


అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అనంతారం నుంచి అశ్వారావుపేటకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. అశ్వారావుపేట గ్రామశివారులో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దారు కార్యాలయానికి తరలించారు.

ఆరుగురిపై బైండోవర్ కేసులు

జూలూరుపాడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు నాటుసారా తయారీ, విక్రయదారులపై బుధవారం బైండోవర్ కేసులను నమోదు చేసినట్లు కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ జయశ్రీ తెలిపారు.

బీమ్లాతండాకు చెందిన బాణోత్ కౌశల్య, బాదావత్ రామిని, సాయిరాంతండా, మాచినేనిపేట, పాపకొల్లు, సూరారం గ్రామాలకు చెందిన తేజవత్ కిషన్, గుగులోత్ బుజ్జి, గుగులోత్ రాజీలి, కొర్రా కృష్ణలపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ స్వాతిబిందు ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు. వారు రూ.2లక్షల బాండ్లను సమర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ ప్రకాశరావు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి



రైతు రమేష్

వైరా, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లాపురం గ్రామంలో మొక్కజొన్న పంటకు సాగునీరు పెట్టేందుకు పొలానికి వెళ్లిన రైతు ప్రమాదవశాత్తు బావిలోపడి మృతిచెందాడు. గ్రామానికి చెందిన వడ్డేపూడి రమేష్ (43) తనకున్న ఎకరం పొలంతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంట సాగుచేస్తున్నాడు. బుధవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో తాను సాగుచేస్తున్న మొక్కజొన్న పంటకు మోటర్ల సహాయంతో తాగునీరు పెట్టేందుకు పొలంవద్దకు వెళ్లాడు. రమేష్ పొలంవద్ద విద్యుత్ మోటార్ నడుస్తూ పొలం వద్ద ఎవరు కనబడకపోవటం గమనించిన మరో రైతు యలమాటి లక్షణ్ రమేష్‌కోసం గాలించగా పొలాల సమీపంలో ఉన్న బావివద్ద రమేష్ చెప్పులు, కండువా కనిపించాయి. దాంతో స్థానిక రైతు లక్ష్మణ్ రమేష్ భార్య కృష్ణవేణికి, స్థానికులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినాడు. ఆ తరువాత స్థానికులు రమేష్ కోసం గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య కృష్ణవేణి, కుమార్తె కీర్తి ఉన్నారు. భార్య ఫిర్యాదుమేరకు సంఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించిన ట్రైనీ ఎస్ఐ వెంపటి పవన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన వాగ్గేయకార ఉత్సవాలు

భక్తిసాగరంలో ఓలలాడించిన సంగీత విద్వాంసుడు డీవీ మోహన్‌కృష్ణ



ఆలపిస్తున్న మోహన్ కృష్ణ

భద్రాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన భక్తరామదాసు జయంతి ప్రయుక్త వాగ్గేయకార ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ నెల ఒకటిన భక్త రామదాసు జయంతిని పురస్కరించుకొని వాగ్గేయకార ఉత్సవాలు ప్రారంభం కాగా ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఎయిర్‌కు చెందిన ఏ గ్రేడ్ బీ గ్రేడ్ కళాకారులను ప్రత్యేకంగా ఎంపిక చేసి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాగ్గేయకార ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆహ్వానించారు. తొలి రోజున ప్రముఖ సంగీత విద్వాంసులు మల్లాది సూరిబాబు వారి కుమారులు మల్లాది సోదరులు నవరత్న కీర్తనలతో రామయ్యకు నీరాజనం పలుకగా అనంతరం నాలుగు రోజుల్లో అనేక మంది ప్రసిద్ధి పొందిన సంగీత కళాకారులు తమ గాత్ర కైంకర్యాన్ని రామునికి సమర్పించారు. వరంగల్‌కు చెందిన సీహెచ్ కృష్ణవేణి గాత్ర కచేరి భక్తులను విశేషంగా అలరించింది. అలాగే హైదరాబాద్‌కు చెందిన వేదాంతం సంపత్ సైతం వాగ్గేయకారుల కీర్తనలు ఆలపించి భక్తులను తన్మయత్వానికి గురి చేశారు. ముఖ్యంగా రాత్రి శాస్త్రీయ సంగీత విద్వాంసులు దేవరకొండ వెంకటమోహన్‌కృష్ణ ఆలపించిన వాగ్గేయకారుల కీర్తనలు భక్తులను సంగీతసాగరంలో ఓలలాడించాయి. ఇదిలా ఉండగా తొలిసారిగా భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి చొరవతో దేవస్థానమే స్వయంగా భద్రాచల దేవస్థానం యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారంకూడా అందించడం పట్ల రామ భక్తులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.

రామయ్య సన్నిధిలో సంగీత కచేరి

భద్రాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో కంచిపీఠం వారు నడుపుతున్న సంప్రదాయ పాఠశాల తిరుపతి విభాగానికి చెందిన విద్యార్థులు భక్తరామదాసు కీర్తనలను ఆలపించారు. భక్తరామదాసు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని తొలి రోజున తిరుపతి వెంకన్న సన్నిధిలో కీర్తనలు ఆలపించగా చివరి రోజున భద్రాద్రి రామయ్య సన్నిధిలో నిత్యకల్యాణ మండప వేదిక వద్ద భక్తరామదాసు కీర్తనలను బుధవారం ఆలపించారు. కోఆర్డినేటరు లక్ష్మీమందాత ఆధ్వర్యంలో 33 మంది విద్యార్థులు కీర్తనలు ఆలపించగా నలుగురు వాయిద్య కళాకారులు సహకారం అందించారు.

'స్థానిక' సర్దు'పాట్లు'

మధిర నియోజకవర్గంలో పంచాయతీ ఎన్నికలపై పార్టీల దృష్టి

గెలుపే లక్ష్యంగా వ్యూహాలు

మధిరటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండగా మధిర నియోజవకర్గంలో రాజకీయ పార్టీలు పొత్తుల ఎత్తులపై కసరత్తు ప్రారంభించాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ఈ కసరత్తులో ముందుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 'స్థానిక' కసరత్తు జరుగుతోంది. స్థానిక ముఖ్యనాయకులతో డిప్యూటీ సీఎం అంతర్గత సమావేశాలు నిర్వహిస్తూ నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో కాంగ్రెస్ సానుభూతిపరులే గెలిచేలా కృషి చేయాలని హితబోధ చేస్తున్నారు. సరిహద్దున్న ఉన్న ఏపీలో టీడీపీ అధికారంలోకి రావడంతో నియోజకవర్గంలోని ఆ పార్టీ శ్రేణులు కూడా పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఎన్డీయే కూటమి అక్కడ విజయవంతం కావడంతో ఇక్కడ కూడా కూటమి పార్టీలు కలిసి పోటీ చేయాలనే ఆలోచన చేస్తున్నారు.

ఇక రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ పంచాయతీ ఎన్నికల్లో సత్తాచాటి మళ్లీ పట్టు పెంచుకోవాలని ప్రణాళికలు వేస్తోంది. ఈ క్రమంలో కలిసి వచ్చే పార్టీలతో పొత్తులకు సై అంటోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ముఖ్యనాయకుడు ఒకరు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాధం వద్ద పొత్తు ప్రతిపాదన తీసుకురాగా ఆయన కూడా ఒకింత సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. గత స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కొన్ని స్థానాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకత్వంతో వైరం ఉన్నచోట బీఆర్ఎస్‌తో కలిసి పనిచేసిన వాహపక్షాలు ఈసారి కూడా అదే వ్యూహంతో వెళ్లే ఆలోచనలో ఉన్నారు. ముఖ్యంగా వామపక్షాలు బలంగా ఉన్న బోనకల్ మండలంలో ఆ పార్టీ గ్రామ స్థాయి నాయకులు బీఆర్ఎస్‌తోనే కలిసి పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తుండగా ఓ వామపక్ష పార్టీ మాత్రం చింతకానిలో కాంగ్రెస్‌తో కలిసి ప్రయాణించేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది.

అయోమయంలో పార్టీ మారిన నేతలు..

కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌తో అధికార పార్టీలో చేరిన నేతలు నేడు అయోమయ స్థితిలో ఉన్నారు. ఇటీవల ప్రకటించిన మధిర మార్కెట్ కమిటీతో పాటు ఆత్మా కమిటీలోనూ ఎక్కడా పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికి ఒక్క డైరక్టర్ స్థానం కూడా దక్కక పోవడంతో వారంతా పునరాలోచనలో పడ్డారు. మధిర మునిసిపాలిటీలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఓ కౌన్సిలర్ తనకు టికట్ రాదని ముందే గ్రహించి కాంగ్రెస్‌కు రాజీనామ చేసి తిరిగి తాను బీఆర్ఎస్‌లోకి వెళుతున్నట్లు తెలిపారు. పదేళ్ల అధికారంలో లేకపోయినా తాము పార్టీని అంటిపెట్టుకొని ఉన్నామని, తమకు కాకుండా కొత్తగా వచ్చిన వారికి టిక్కెట్లు ఎలా ఇస్తారని స్థానిక నేతలు ప్రశ్నిస్తుండడంతో తమకు టిక్కట్ దక్కక పోతే పరిస్థితి ఏంటని కొత్తగా పార్టీలో చేరిన వారు ఆలోచనలో పడ్డారు.



ఇటీవల ఎర్రుపాలెం మండలంలో పెద్ద ఎత్తున పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న భట్టి

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ అక్రమ అరెస్టులను ఖండించండి

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు



ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ట్రైనీ డాక్టర్ అభయపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజాస్వామ్యయుతంగా రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన సీపీఐ(ఎంఎల్)పొలిట్ బ్యూరో సభ్యుడు, పశ్మి బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అలీక్ చక్రవర్తిని, రాష్ట్ర నాయకులు శుక్లానూ, ప్రియంబసునూ, మరి కొంతమంది సానుభూతిపరులను పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేయటం అప్రజాస్వామిక చర్యగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఖండించారు. ఈ మేరకు ఖమ్మంలో బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2024సెప్టెంబరు 9న కొల్‌కత్తాలోని ఆర్‌జికర్ హాస్పటల్‌లో శిక్షణా డాక్టర్‌పై జరిగిన సంఘటనపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సరిగా స్పందించలేదని, పోలీసులు వ్యవహరించిన తీరు అనుమానాలకు తెరలేపిందని ఆరోపించారు. బాధితులకు న్యాయం జరపాలని ఫిబ్రవరి 5న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు అక్కడ మాస్‌లైన్ పార్టీ పిలుపు ఇవ్వటంతో ముందస్తు అరెస్టులు చేశారని, బాధితులకు న్యాయం చేసే వరకు పోరాడుతామని హెచ్చరించారు. అరెస్టు చేసిన వారిని భేషరుతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బస్టాండులో దొంగతనం

తల్లాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తల్లాడ బస్టాండులో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మహిళ ప్రయాణికురాలి వద్ద ఉన్న సంచిని కత్తిరించి సెల్‌ఫోన్, పర్సు అపహరించుకోపోయాడు. తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన గాదే పద్మవతి తల్లాడ నుంచి ఖమ్మం వెళ్లేందుకు ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కుతున్న సమయంలో పద్మవతి చేతిలో ఉన్న సంచిని కత్తిరించి అందులో గల రూ. 10 వేలు విలువ చేసే సెల్‌ఫోన్, పర్సును ఎత్తుకెళ్లాడు. పర్సులో రూ.500 నగుదు ఉంది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు బస్టాండు చేరుకుని విచారించారు.

రెండో రోజు కొనసాగిన అంతర్ రాష్ట్ర నాటకోత్సవాలు

భద్రాచలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు రెండో రోజు బుధవారం కొనసాగాయి. తొలుత స్థానిక క ళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పాడుతా తీయగా జూనియర్స్‌చే సినీ పాటల సందడి నిర్వహించగా రసజ్ఞులైన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ క్రమంలో కవి, వ్యాఖ్యాత ఎన్‌సీహెచ్ చక్రవర్తి జాతీయ పవర్ లిఫ్టింగ్ గోల్డ్‌మెడలిస్టు గాలి రామ్మోహన్‌రావు, ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు పాకాలపాటి రోశయ్యకు, పాల్వంచ నీలి నందీశ్వరరావులను ఘనంగా సత్కరించారు. ఇదిలా ఉండగా గురువారం అంతరాష్ట్ర నాటకోత్సవాలు ముగియనున్నాయి.

ఆలోచింపజేసిన స్వేచ్ఛ నాటిక

హైదరాబాద్‌కు చెందిన విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారిచే స్వేచ్ఛ నాటికను ప్రదర్శించారు. ఈ నాటికలో మహేశ్వరి, శ్వేత, అవినాష్, ఆనంద్, మూర్తిలు నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. నాటికలో భాగంగా మితిమీరిన స్వేచ్ఛ, పరిమితులు లేని జీవితం వలన ఎలాంటి పరిణామాలు మనషి జీవితంలో సంభవిస్తాయో నాటికలో ప్రదర్శించారు.



స్వేచ్ఛ నాటకంలోని ఓ సన్నివేశం

తెగిన గాలిపటాలంటివి, దారం అనే హద్దులో గాలిపటం ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతుంది, మరి ఆ దారం అనే హద్దు తెగిపోతే ఆకాశంలో గాలివాటానికి ఎటుపోతోందో దానికి ఎరకని సారాంశం ఆధారంగా కథనం ముందుకు సాగుతుంది. ఈ నాటిక మూల కథ పీఎస్ నారాయణ అందించగా, నాటకీకరణ పరమాత్ముని శివరాం చేయగా, బీఎం రెడ్డి దర్శకత్వం వహించారు.



తుమ్మల చెరువులో బోటింగ్ చేస్తున్న పీవో రాహుల్

భద్రాద్రికి పర్యాటక సొబగులు

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్

అశ్వాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు పర్యాటక సొబగులు సమకూరుస్తామని, త్వరలోనే మరిన్ని పర్యాటక కేంద్రాలను గుర్తిస్తామని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. బుధవారం ఆయన మండల పరిధిలోని తుమ్మలచెరువులో బోటింగ్‌ను స్వయంగా పరిశీలించారు. సందర్శకుల తాకిడిని డ్వాక్రామహిళలను అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ ప్రాంగణంలో ట్రైబల్ మ్యూజియం త్వరలో ప్రారంభిస్తామన్నారు. బొజ్జుగుప్ప, కిన్నెరసాని, తుమ్మలచెరువులు బోటింగ్‌కు అనువుగా ఉన్నాయని అన్నారు. బోటింగ్‌కు వచ్చే పర్యాటకుల పట్ల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం పీవో చెరువులో బోటింగ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సహయ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్‌రాజ్, ఎస్‌వో ఉదయ్‌భాస్కర్, జేడీఎం హరికృష్ణ, సెక్రటరీ దినేష్‌కుమార్ నిర్వాహకులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య సినీ నిర్మాత కేపీ చౌదరి అంత్యక్రియలు



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

మధిరటౌన్/ బోనకల్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): గోవాలో ఆత్మహత్యకు పాల్పడిన ప్రముఖ సినీ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ బోడేపూడి కృష్ణ ప్రసాద్ చౌదరి(కేపీ చౌదరి) అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రాయనపేట గ్రామంలో నిర్వహించారు. సోమవారం గోవాలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఆయన మృతదేహాన్ని బంధువులు బుధవారం తెల్లవారుజామున రాయనపేటకు తీసుకువచ్చారు. ఆయన మృతదేహాన్ని చూసి తల్లి విజయ, భార్య సాహిష్ట నోసిల్, పదేళ్ల కుమారుడు కార్తికేయ కన్నీరు మున్నీరుగా విలపించారు. కేపీ చౌదరి మృతదేహాన్ని కడసారి చూసేందుకు సినీ, టీవీ నటులు హేమ, సురేఖవాణి, జ్యోతి, సుప్రిత, బాలతో పాటు పలువురు డిస్ట్రిబ్యూటర్లు, టెక్నీషియన్లు, బంధువులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎప్పుడు గ్రామానికి వచ్చినా తన చిన్ననాటి మిత్రులతో పాటు బంధువులను ఎంతో ఆప్యాయంగా పలకరించే కేపీ చౌదరి చిన్న వయస్సులోనే మరణించడం వారిని కలతకు గురిచేసింది. సినీ ఆడియో, ప్రీ రిలీజ్ ఈవెంట్లకు తన బంధుమిత్రులను ఆహ్వానించడమే కాకుండా ఎప్పుడు గ్రామానికి వచ్చిన ఖరీదైన కార్లలో వచ్చే చౌదరికి ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉందనకున్న గ్రామ ప్రజలు ఆయన మరణాన్ని నమ్మలేకున్నారు. సినీ రంగలో వారితో కూడా ఎంతో కలివిడిగా ఉండే చౌదరి మరణం ఆయన అంత్యక్రియలకు వచ్చిన సినీ, టీవీ ఆర్టిస్టులను కూడా ఎంతో కలచి వేసింది. ఆయన అంతిమయాత్రకు పెద్ద సంఖ్యలో బంధువులు, మిత్రులు హాజరవ్వగా కేపీ చౌదరి చితికి ఆయన కుమారుడు కార్తికేయ చేత నిప్పంటించి అంత్యక్రియలు నిర్వహించారు.

భార్యను హత్య చేసిన కేసులో భర్తతో పాటు అత్తకు జీవిత ఖైదు

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన కేసులో ఓ కానిస్టేబుల్‌కు, అతడి తల్లికి జీవిత శిక్ష విధిస్తూ ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ బుధవారం తీర్పుచెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి... సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం పాలారం తండాకు చెందిన భూక్యా కాలియా తన కూతురు కళ్యాణిని ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురం తండాకు చెందిన తేజావత్ ఉపేంద్ర నాయక్‌కు ఇచ్చి మే18 2017న వివాహం చేశారు. ఉపేంద్రనాయక్ ఛత్తీస్‌గఢ్‌లో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. వివాహ సమయంలో 4లక్షల 50వేలు కట్నంగా ఇచ్చారు. కొంతకాలం వారి సంసారం సక్రమంగా సాగింది. వారికి ఒక పాప పుట్టిన తర్వాత నుంచి అత్తమామలతో పాటు ఆడపడుచు కూడా అదనపు కట్నం కొరకు తరచూ వేధిస్తుండేవారు. ఈ విషయాన్ని పెద్దమనుషుల దృష్టికి, పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా కాలియా తనకున్న కొంత భూమిని అమ్మి సెప్టెంబరు 19 2019 నాడు అదనపు కట్నం కింద డబ్బులు ఇచ్చారు. అనంతరం 12 ఫిబ్రవరి 2020 సాయంత్రం సుమారు ఐదు గంటల ప్రాంతంలో ఉపేంద్రనాయక్ ఫోన్‌చేసి నీ కూతురు కళ్యాణి కళ్లుతిరిగి పడిపోయిందని కాలియాకు చెప్పాడు. వెంటనే కాలియా బాణాపురం తండాకు వెళ్లి తన కూతురిని పరిశీలించగా కొట్టి గాయపరిచి హత్యచేసినట్లుగా గుర్తించారు. ముదిగొండ పోలీసులకు 13 ఫిబ్రవరి 2020 నాడు ఫిర్యాదుచేయగా కేసునమోదు చేశారు. పోలీసులు కేసును విచారించి కోర్టులో చార్జిషీట్ దాఖలుచేశారు. విచారించిన జిల్లా న్యాయాధికారి నేరం రుజువుకావటంతో నిందితులకు జీవితఖైదు శిక్షవిధిస్తూ తీర్పుచెప్పారు. మరో ముగ్గురు నిందితులైన తేజావత్ కృష్ణ, ఇస్లావత్ అరుణ, దారా కవితలను నిర్దోషులుగా విడుదలచేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏశంకర్ వాదించగా లైజన్ ఆఫీసర్ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుళ్లు నాగేశ్వరరావు, పి.ఆదినారాయణ, హోంగార్డు ఎండి యూసఫ్ సహకరించారు.

చోరీ కేసు నిందితుడి అరెస్ట్

24 గంటల్లో కేసును చేధించిన పోలీసులు

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 24 గంటల్లో చోరీ కేసును చేధించి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. కారెపల్లి మండలం గంగారాం తండకు చెందిన భూక్య మంగీలాల్ అనే రైతు ఫిబ్రవరి 3న ఖమ్మం పత్తి మార్కెట్‌లో పత్తిని విక్రయించాడు. వచ్చిన రూ.74వేలను తన సంచిలో పెట్టుకొని ఇంటికి వెళ్లేందుకు రాత్రి 8గంటల సమయంలో ఖమ్మం పాత బస్టాండ్‌కు వచ్చాడు. బస్సు కోసం వేచి ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు నగదు దొంగిలించినట్లు బాధితుడు ఫిబ్రవరి 4 మంగళవారం ఖమ్మం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి కేసుపై ప్రత్యేకదృష్టిపెట్టి 24 గంటలలో చేధించి వైఎస్ఆర్ కాలనీకి చెందిన అగు అబ్దుల్లా అనే నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవటంలో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు పి.రామకృష్ణ, బొర్రయ్యను టౌన్ ఏసీపీ రమణమూర్తి అభినందించారు.

వైరు చోరీ.. ఐదుగురికి రిమాండ్

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): వైరు చోరీ చేసి తరలిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఖానాపురం వద్ద బుధవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా రఘునాధపాలెం మండలం రేగులచలకకు చెందిన జంగా వెంకన్న ఓ వాహనంలో వైర్‌ను తీసుకుని వెళుతున్నాడు. ఆపి తనిఖీచేయగా పలు ప్రాంతాల్లో దొంగిలించిన వైరుగా తేలింది. కొణిజర్ల మండలంలో ఓ గ్రామంలో గొర్లదొడ్డిలో పదిగొర్రెలను నగరానికి చెందిన అశోక్, నాగేందర్, నల్లారాము, సుమంత్ అనే వారితో కలిసి దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ ఈనెల 28వరకు ..

ఖమ్మం ఖానాపురం హవేలీ,ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాపర్తినగర్ మైనారిటీ బాలికల జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సర అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అఖిల బుధవారం తెలిపారు. మొత్తం 80 సీట్లకుగాను 60 సీట్లు ముస్లీం, మైనారిటీలకు, మిగిలిన వాటిల్లో 10 బీసీలకు, 5 ఎస్సీ, 3 ఎస్టీ, 2 ఓసీలకు కేటాయించినట్లు చెప్పారు. అడ్మిషన్ల దరఖాస్తులను ఈనెల 18 నుంచి 28 వరకు ఆన్‌లైన్లో చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9154365017 సంప్రదించాలని తెలిపారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	34
గుత్తి వంకాయ	40
బీరకాయ	48
పచ్చిమిర్చి	24
బెండకాయ	48
బెండకాయ	48
పొట్లకాయ	40
దోసకాయ	28-44
చిక్కుడు	38
నాటుచిక్కుడు	80
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	20
దొండ	26-34
సొరకాయ	18
క్యారెట్	28
క్యాప్సికం	54
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	150
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

తిరిగి వచ్చేందుకు సిఫారసులు

- బదిలీపై వెళ్లిన నెల రోజులకే ప్రయత్నాలు
- ఉద్యోగ సంఘాల నాయకులతో పైరవీలు
- కేఎంసీకి మరో తలనొప్పి



ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి బదిలీపై వెళ్లిన ఉద్యోగులు కొందరు తిరిగి వచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందుకోసం ఉద్యోగ సంఘాల నాయకులను ఆశ్రయిస్తున్నారు. ఖమ్మం నగర పాలక సంస్థలో దశాబ్ద కాలంగా పాతుకుపోయిన జరిగిన రెండు ఉద్యోగ వర్గాల ముఖ్య నాయకులను ఇటీవల కేఎంసీ నుంచి ఇతర మున్సిపాలిటీకి కమిషనర్ అభిషేక్ అగస్త్య పంపేశారు. పరిపాలన గాడిలో పెట్టే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇద్దరు ఉద్యోగులు కేఎంసీ నుంచి బయటకు వెళ్లిన తర్వాత కేఎంసీ పరిపాలన సైతం గాడిలో పడింది. తర్వాత ఒకరి తర్వాత మరోకరి చొప్పున కేఎంసీలో తిష్ట వేసిన ఉద్యోగులను ఇతర విభాగాలకు కమిషనర్ మార్పులు, చేర్పులు చేశారు. ఇంజనీరింగ్, రెవెన్యూ, ఏకౌంట్స్, టౌన్‌ప్లానింగ్ వరకు మార్పులు జరిగాయి. కేఎంసీకి వార్డు ఆఫీసర్లు రావటంతో ముఖ్యమైన సెక్షన్‌లను రెగ్యులర్ ఉద్యోగులకు కేటాయించి కమిషనర్ పరిపాలన గాడిలో పెడుతున్నారు. అయితే కేఎంసీ నుంచి పరిపాలన చర్యల్లో భాగంగా ఇద్దరు ఉద్యోగులను మహాబూబాబాద్, డోర్నకల్ మున్సిపాలిటీలకు బదిలీలు జరిగాయి. బయటకు వెళ్లిన నెల రోజులకే ఇద్దరు ఉద్యోగులు తిరిగి ఇక్కడకే వచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కార్పొరేటర్లు, ఉద్యోగ సంఘం మాజీ నాయకులను నేరుగా కేఎంసీకి పంపి అధికారుల వద్ద సిఫారసు ప్రయత్నాలు ప్రారంభించారు. మరోకరు సైతం ఉద్యోగ సంఘం నాయకులతో పాటుగా కేఎంసీలోని అధికారితో మళ్లీ పాగా వేసేందుకు విశ్వప్రయత్నాలు ప్రారంభించారు. నూతనంగా ఉద్యోగాల్లో చేరిన రెగ్యులర్ ఉద్యోగులతో ఇప్పుడే గాడిలో పడుతున్న కేఎంసీ పరిపాలనకు తిరిగి సిఫారసుల గోల అధికారులకు తలనొప్పిగా మారింది.

కులగణన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంది

- ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది...
- కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బొందయ్య



మాట్లాడుతున్న జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు

నేలకొండపల్లి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కులగణన నిర్వహించి కాంగ్రెస్ హామీని నిలబెట్టుకుందని కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య అన్నారు. బుధవారం నేలకొండపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బొందయ్య మాట్లాడారు. ఫిబ్రవరి నాలుగో తేదీ చరిత్రలో లిఖించతగ్గ రోజన్నారు.దేశంలో ఏప్రభుత్వం చేయని విధంగా కులగణన నిర్వహించి తెలంగాణా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు, దేశానికి మార్గదర్శిగా నిలిచిందని బొందయ్య కొనియాడారు. శాసనసభలో ఏ,బీ,సీ వర్గీకరణ చేసిందన్నారు.క్రీమిలేయర్‌కు కాంగ్రెస్ పూర్తి వ్యతిరేకమన్నారు. సమావేశంలో పాలేరు కాంగ్రెస్ సేవాదళ్ నాయకుడు బచ్చలకూరి నాగరాజు,రిషికేష్ యండ్రాతి,పెద్దపాక సైదులు, బండి కరుణాకర్, కుక్కల హనుమంతరావు, గుడిపాటి ముక్కంటి, బీసీసంఘం నాయకులు లక్కం ఏడుకొండలు, మోర మల్లయ్య, కైలాసపు వెంకటేశ్వర్లు, మామిడి వెంకన్న,మారగాని అంజయ్య, మక్కాల రామకృష్ణ పాల్గొన్నారు.

సమన్యాయం ఉంది

ఖమ్మంచర్చికాంపౌండ్: ఎస్సీవర్గీకరణ ఉద్యమంలో సమన్యాయం, సామాజిక న్యాయం ఉందని, ఎస్సీవర్గీకరణ అమలుచేయడం చరిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కోటా రాంబాబు పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఎం నిర్ణయాన్ని కొనియాడారు.

ఎస్సీవర్గీకరణపై మాలమహానాడు నిరసన



ఖమ్మంచర్చికాంపౌండ్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలను వర్గీకరిస్తూ అసెంబ్లీలో తీర్మానించడం పట్ల మాలమహానాడు ఆధ్వర్యంలో ఖమ్మం అంబేద్కర్ సెంటర్‌లో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగ విరుద్ధంగా దళితులను విభజించి పాలించే కుట్రలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయని మాలమహానాడు ఉమ్మడి ఖమ్మంజిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన శాస్త్రీయంగా లేదన్నారు. ఆర్టికల్ 21 ప్రకారం కులగణన కేంద్రమే చేయాల్సి ఉందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పల్లా రాజశేఖర్, లింగాల రవికుమార్, కొట్టె సుధాకర్, దాసరి శ్రీనివాస్, తొగరు భాస్కర్, పేరం మల్లయ్య పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివి విజయం సాధించాలి

ఖమ్మంఖానాపురంహవేలి,ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి):ప్రణాళికతో చదివి విజయం సాధించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం నగరంలోని ఎన్ఎస్సీ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న మోటివేషన్ తరగతులను కలెక్టర్ పరిశీలించారు. పరీక్షల సమయంలో భయం తగ్గలంటే ముందు నుంచే ప్రణాళికతో చదవాలని అన్నారు. ఈ రోజు పని రేపటికి వాయిదా వేయవద్దని, పనులు వాయిదా అలవాటు పడితే లక్ష్యాలను చేరుకోలేరన్నారు.ఆరోగ్యమైన ఆహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్ తీసుకోవద్దని అన్నారు. మోటివేషన్ స్పికర్ నాగేశ్వరరావు అవగాహన, మోటివేషన్ తరగతిని కలెక్టర్ విద్యార్థులతో కలిసి ఆసక్తిగా విన్నారు.ఈ కార్యక్రమంలో డీఈవో సోమశేఖర శర్మ, హెచ్ఎం రాజేంద్రప్రసాద్, యలమద్ది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐబీఎంతో ఎస్‌బీఐటీ ఒప్పందం



ఐబీఎంతో ఒప్పంద సర్టిఫికెట్లతో కృష్ణ

ఖమ్మంఖానాపురంహవేలి ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ఐబీఎంతో ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల అవగాహనా ఒప్పందం కుదుర్చుకుందని కళాశాల చైర్మెన్ గుండాల కృష్ణ తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాలకు పదును పెట్టడంతో ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవటానికి సీఎస్ఆర్ బాక్స్‌ఫౌండేషన్ సౌజన్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బుధవారం కళాశాలలో జరిగిన ఐబీఎం సంస్థ ప్రతినిధులతో అవగాహనా ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఈ ఒప్పందం రానున్న మూడు సంవత్సరాలు అందుబాటులో ఉంటుంద కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ డాక్టర్ జీ ధాత్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, సంస్థ ప్రతినిధులు, కళాశాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

రఘునాథపాలెం, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): దేశంలోని తొలిసారిగా బీసీ కులగణనకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావటం బీసీ కులస్థులకు శుభపరిణామమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణనపై ప్రకటన చేయటంతో చిమ్మపూడిలో కాంగ్రెస్ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు జోనెబోయిన పాపయ్య, పర్మిసెట్టి నరేశ్, రహీం, పావురాల రాముడు, వెంకన్న, పొన్నం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



చిమ్మపూడిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీసీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలి

ఖమ్మంచర్చికాంపౌండ్: బీసీ జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లకు చట్టబద్ధత కలిపించి స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బీసీహక్కుల సాధన సాధన సమితి డిమాండ్ చేసింది. బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతిపత్రం అందించారు. కేంద్రప్రభుత్వం బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేసి నిధులు కేటాయించి వెనుకబడిన తరగతుల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లబిల్లు పెట్టి ఆమోదించాలని కోరింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శింగు నర్సింహారావు,సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల శ్రీనివాసరావు, జిల్లాప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, గాదె లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పురోహితుడి కుటుంబానికి పరామర్శ



శివరామయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మధు, సండ్ర

కూసుమంచి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కూసుమంచికి చెందిన పురోహితులు దేవులపల్లి శివరామయ్య కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. శివరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుమారుడు శివాలయం పూజారి శేషగిరిని, విలేఖరి రమణను పరామర్శించారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రగాఢసానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యాదవ మహాసభ యూత్ అధ్యక్షుడిగా రామకృష్ణ

కూసుమంచి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): యాదవ మహాసభ కూసుమంచి మండల యూత్ అధ్యక్షుడు శ్రీలం రామకృష్ణను నియమించారు. జిల్లా అధ్యక్షుడు కూరాకుల నాగభూషణం నియామకపత్రాలు అందజేశారు. యాదవసంఘంలో యువకులను సంఘటితం చేసి సంక్షేమ పథకాలను అందరికి అందేలా కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రోషయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్సూరు, యూత్ అధ్యక్షులు జడ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

10న జరిగే ధర్నాను జయప్రదం చేయాలి

ఖమ్మంసాంస్కృతికం,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ రైతులకు, కార్మికులకు వ్యతిరేకంగాఉందని, ఈ నేపథ్యంలో ఈనెల 10న హైదరాబాద్‌లో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదంచేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతురాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. ధాన్యం బోనస్, రుణమాఫీ, రైతు భరోసా డబ్బులను ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు తాతాభాస్కర్ రావు, బండి రమేష్, వాసిరెడ్డి ప్రసాద్, ఎస్‌కే మీరా, దుగ్గికృష్ణ పాల్గొన్నారు.

లడ్డూ వేలం రూ.16వేలు



తిరుమలాయపాలెం, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెంలోని శ్రీకుసుమహరినాథబాబా కల్యాణ వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఈనెల3న ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. లడ్డూ వేలం పాట నిర్వహించారు. తిరుమలాయపాలేనికి చెందిన మద్దినేని మధు, ప్రగతి దంపతులు రూ.16వేలకు దక్కించుకున్నారు. ఈకార్యక్రమంలో కొండబాల కరుణాకర్, బాబురావు, శ్రీను, కె.వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, మల్లీడి నాగన్న, పాల్గొన్నారు.

కేఎంసీ కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీసు

వివరణ కోరిన కమిషనర్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో కాంట్రాక్టర్‌కు కమిషనర్ అభిషేక్ అగస్త్య షోకాజ్ నోటీసులు జారీ చేయటం చర్చనీయాంశంగా మారంది. కేఎంసీ కార్యాలయం శుభ్రం చేయటం, నిర్వాహణ కాంట్రాక్టర్‌ను టీ.శ్రీనివాసరావుకు అప్పగించారు. అయితే ఇటీవల కాలంలో నిర్వాహణ పరమైన ఇబ్బందులు ఉన్నాయని కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టికి రావటంతో బుధవారంరాత్రి కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సీజీఎస్‌టీ, మరియు ఏజీఎస్టీ, ఉద్యోగులకు సంబందించిన ఈపీఎఫ్, ఈఎస్ఐ సంబంధిత వివరాలను కోరారు. సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ నెలవారీ బిల్లులను షోకాజ్‌లో కోరారు.ఉద్యోగులకు చెల్లించిన వేతనాలను ఉద్యోగుల బ్యాంకు ఖాతా పుస్తకాల జీరాక్స్‌లను కోరారు. కార్మికుల ఈపీఎఫ్, ఈఎస్ఐ రెమిటెన్స్ వివరాలను, కార్మికులను నియామకానికి కావాల్సిన లేబర్ లైసెన్స్‌ల వివరాలతో రెండురోజుల్లో ఇవ్వాలని అగస్త్య షోకాజ్ నోటీసులో కోరారు.

కోయచెలకకు వ్యవసాయశాస్త్రవేత్తలు

ముందే ఈనిన వరి పొలాల పరిశీలన

రఘునాథపాలెం,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోయచెలక గ్రామంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటించారు. ఇటీవల కోయచెలకలో 30 ఎకరాల్లోని వరి పంట ముందుగానే ఈనటం ప్రారంభించింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.అధిక దిగుబడి వస్తుందనే నమ్మకంతో ఓ ప్రైవేట్ విత్తన కంపెనీ వరివిత్తనాలను కొనుగోలు చేశారు. ముదురు నారు నాటటం వల్ల ఈలా జరిగిందని కొంతమంది ప్రచారం చేయటంతో బాధిత రైతులు మరింత ఆందోళనకు గురయ్యారు. నాల్గురోజులుగా కోయచెలకకు వస్తున్న వ్యవసాయశాఖ అధికారులు కూడా సరైన కారణం చెప్పలేకపోయారు. దీంతో బుధవారం వైరాకేవీకే శాస్త్రవేత్త రవికుమార్, టీఎస్ సీడ్స్ రీజనల్ మేనేరు బిక్షం,ఏవో ఉమామహేశ్వరరావు కోయచెలకలో వరిపంటలను పరిశీలించారు. నమూనాలను సేకరించారు.



వరి పంటలో పరిశీలన చేస్తున్న అధికారులు

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ శ్రీజ

కారేపల్లి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వ సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్నికల సామాగ్రిని సిబ్బందికి పంపిణీ చేయనున్న గదులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులతో మాట్లాడుతూ విధులు నిర్వహించే ఉద్యోగులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అడిగితెలుసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండానే చూడాలన్నారు.

జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులను చెట్లకింద కుర్చోపెట్టి తరగతులు చెబుతుండడంతో అదనపు కలెక్టర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదులలో ఉంచి పాఠాలు బోధించాలన్నారు. కళాశాలలో పనిచేయని మినరల్‌వాటర్ ప్లాంట్‌ను గమనించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఈసందర్భంగా కళాశాల భవన మరమ్మతులకు ఇతర సదుపాయల కోసం రూ.30లక్షలు నిధులను కేటాయిస్తున్నట్లుగా ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్, తహసీల్దార్ సంపత్‌కుమార్ ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఉపాధి పనితో సంబంధం లేకుండా

పేదలకు రూ.12వేలు ఇవ్వాలి

నేలకొండపల్లి, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో సంబంధం లేకుండా పేదలకు రూ.12వేలను అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు ఎర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు తగ్గించటాన్ని నిరసిస్తూ నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో బడ్జెట్ ప్రతులను తగులపెట్టారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ పూర్తిగా సంపన్నులకు అనుకూలంగా, పేదలకు వ్యతిరేకంగా ఉందన్నారు.పేదల కష్టాన్ని పన్నుల రూపంలో గుంజుకుని, సంపన్నులకు దోచి పెడుతున్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించనున్నట్లు శ్రీనివాసరావు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి, కొత్తా రమేష్, బొడ్డు అంజనేయులు, సామాల మల్లికార్జున్, దుగ్గి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, నారాయణ, వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- రెవెన్యూ ఉద్యోగుల సర్వీస్ సంఘం జిల్లా అధ్యక్షుడు

తిరుమలాయపాలెం,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సర్వీసెస్ సంఘం జిల్లా అధ్యక్షుడు తుంబూరు సునీల్‌రెడ్డి, కార్యదర్శి దొడ్డా పుల్లయ్య తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.అలాగే సంఘం నూతన డైరీ,కేలండర్ ఆవిష్కరించారు రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి కృషిచేస్తామన్నారు. అలాగే వీఆర్యేలకు వారసత్వ ఉద్యోగాలు విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి ఉద్యోగాలు ఇచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమలో తహసీల్దార్ పీవీ రామకృష్ణ, డీటీ నర్సింహారావు, ఆర్ఐ వీరయ్య, సిబ్బంది వహీద్, జ్యోత్స్న పాల్గొన్నారు.

8నుంచి జీళ్లచెరువు శ్రీవారి బ్రహ్మోత్సవాలు

12 శ్రీవారి కల్యాణం

కూసుమంచి,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): కూసుమంచి మండలం జీళ్లచెరువు గ్రామంలో ఈనెల 8నుంచి13 వరకు శ్రీవారివార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జగన్మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 12న మధ్యాహ్నం శ్రీస్వామివారి తిరుకల్యాణం అన్నప్రసాదం, సాయంత్రం గ్రామసేవ (ఊరేగింపు) జరుగుతుందని పేర్కొన్నారు. కల్యాణానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. 13న శ్రీపుష్పయాగం, రాత్రి పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఏనుకుంటతండా చెరువుకు సాగునీరు



సాగు నీటి సరఫరాకు తవ్వకాలు చేస్తున్న యంత్రాలు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుకుంటతండా చెరువుకు ఎస్ఆర్ఎస్పీ కాలవ ద్వారా నీరు తెచ్చేందుకు ఇరిగేషన్ అధికారులు పనులు చేపడుతున్నారు. ఈచెరువుక సాగునీటి సౌకర్యం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివారెడ్డి దృష్టికి రైతులు తేగా ఈ విషయమై మంత్రి సంబంధిత ఇరిగేసన్ అధికారులను ఆదేశించారు.దీంతో డీఈ బానాల రమేష్‌రెడ్డి, ఏఈ రామకృష్ణల ఆధ్వర్యంలో రెండురోజుల నుంచి చెరువుకు నీరు తెచ్చేందుకు జేసీబీ సాయంతో పనులు చేపడుతున్నారు. ఎస్ఆర్ఎస్పీ కాలవ ద్వారా తండా చెరువు నింపేందుకు అధికారులు పనులు చేపడుతున్నారు. రెండు, మూడురోజుల్లో పనులు పూర్తిచేసి చెరువకు నీరు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఆయకట్టుకింద పంటలు పండే అవకాశం ఉంది.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

విద్యార్థులు స్వీయ రక్షణపై దృష్టి సారించాలి

» బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారి సోనీప్రేమ్‌లీనా

ఏన్కూరు, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు స్వీయ రక్షణపై దృష్టి సారించాలని బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ సోనీప్రేమ్‌లీనా అన్నారు. సమాజంలో చిన్నపిల్లలపై పెరుగుతున్న లైంగికదాడులకు అత్యాచారాలు, నిర్మూలనపై బుధవారం ఉషోదయ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సభ్యులు శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

మధిరటౌన్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మధిర శ్రీగంగా పార్వతీ శ్రీమృత్యుంజయ స్వామి దేవాలయం హుండీని బుధవారం అధికారుల సమక్షంలో దేవాలయంలో నిర్వహించారు. జిల్లా దేవాదయ ధర్మాదయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లెక్కించగా గత మూడు నెలలకు గాను హుండీ ద్వారా దేవాలయానికి రూ1,19,417 లభించింది. ఈ కార్యక్రమంలో ఈవో జగన్మోహన్ రావు, సిబ్బంది రాధ, అర్చకులు రాయప్రోలు సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

సత్తుపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపురి కాలనీలోని 7వ లైన్‌లో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు రూ.1,11,116విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు నరుకుళ్ల శ్రీనివాసరావు, మమత, గగన్ సాత్విక్, రాములు, వెంకటమ్మలను నిర్వాహకులు ద్రోణంరాజు మల్లిఖార్జునశర్మ, వందనపు సత్యనారాయణలు, రాగాల చంద్రారెడ్డి వారిని ఘనంగా సన్మానించారు.

'లక్ష్యంతో చదవాలి'

కారేపల్లి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యంతో చదివి పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని కెరీర్, గైడెన్స్ వ్యక్తిత్వ నిపుణుడు రాణాప్రతాప్ అన్నారు. ఎన్నారై ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాల, జూనియర్ కళాశాలల విద్యార్థులకు కెరీర్‌పై నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో స్పెషల్ ఆఫసర్ ఝాన్సీసౌజన్య, సిబ్బంది అన్నపూర్ణ, కవిత, కృష్ణవేణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

» ఐదుగురిపై కేసు నమోదు

» రూ.9వేల నగదు స్వాధీనం

కల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గనియతండ గ్రామం సమీపాన పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేశారు. గనియతండ సమీపాన సాగర్ కెనాల్ లాకుల వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి నిందితులను అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,040 నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

చైన్‌స్నాచర్ పట్టివేత

పెనుబల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన అర గంట వ్యవధిలోనే దొంగను వీఎం బంజర్ ఎస్ఐ వెంకటేష్ పట్టుకున్నారు. మండల పరిధిలోని ఎడ్లబంజర గ్రామంలో బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ఓ కిరణా షాపు నడుపుతున్న ఇప్పిరిశెట్టి రాము తన దుకాణం ముందు ఉండగా, ఓ వ్యక్తి చేతిలో హెల్మెట్ పట్టుకొని వచ్చాడు. షాపులో ఏమైనా వస్తువులు కావాల అంటూ రామును అడుగుతూ అతడి మెడలో ఉన్న 15గ్రాముల బంగారు గొలుసును లాగుతుండగా రాము ప్రతిఘటించాడు. గొలుసుతో దొంగ పరారయ్యాడు. వెంటనే గ్రామస్థులు ఎస్ఐ వెంకటేష్‌కు సమాచారం అందించారు.

కానిస్టేబుల్ రాజమల్లుతో కలిసి ద్విచక్ర వాహనంపై దొంగ పారారైన ప్రదేశం వైపు వెళ్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. గ్రామంలోకి పారారైన దొంగ తోట వెంకటేశ్వరరావు ఇంటి ముందు గేటు తెరిచి ఉండటంతో ఆ ఇంట్లో ప్రవేశించాడు. గ్రామస్థులు కేకలు వేయడంతో ఇంటి వెనుక వైపు నుంచి పారారయ్యేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఎస్ఐ వెంకటేష్ గ్రామస్థులతో కలిసి దొంగను పట్టుకున్నారు. దొంగ వద్ద ఉన్న బంగారు గోలుసును రాముకు అప్పగించి, దొంగను పోలీసుస్టేషన్ తరలించారు. ఎస్ఐ వెంకటేష్‌ను గ్రామస్థులు అభినందించారు. కాగా బంగారు గొలుసు విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని అంచనా.

తరిగిపోతున్న గుట్టలు

» జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు

» పట్టించుకోని అధికారులు



అక్రమంగా గుట్టలను తవ్విన దృశ్యం

ఏన్కూరు, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ప్రకృతి అక్ర మార్కులకు ఆదాయ వనరుగా మారింది. వారి ఆగడాలతో గుట్టలు కరిగి పోతున్నాయి. గత కొన్నేళ్ల నుంచి యథేచ్ఛగా జన్నారం రెవెన్యూ పరిధిలోని నిషేధిత జాబితా లోని గార్లొడ్డు గుట్టలను అక్రమ వ్యాపారులు కొల్లగొడుతూ కోట్లరూపాయలు దండుకుంటున్నారు. కంకర మిలుల్లకు, అక్రమ మట్టి వ్యాపారులు తోడై గుట్టలను పిండిచేస్తున్నారు. ఇదే విధంగా కొనసాగితే మరికొన్ని ఏళ్లలోనే గుట్టలు కనుమరుగయ్యే అవకాశం ఉంది. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ సంపదను దోచుకుంటున్న సంబంధిత మైనింగ్‌శాఖ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పచ్చని అడవులు కనుమరుగై పోతున్నాయి. అటవీ సంపద అంతరించిపోతుంది. వన్యప్రాణులు అంతరించిపోయి పర్యావరణానికి హాని కలుగుతుందని గతంలో గార్లొడ్డు గ్రామానికి చెందిన ఓవ్యక్తి జాతీయ గ్రీన్‌ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశాడు. గ్రీన్‌ట్రిబ్యునల్ అధికారులు ఈప్రాంత పరిసరాలను పరిశీలించారు. అప్పటి నుంచి కొంతకాలం తవ్వకాలు ఆగాయి. మళ్లీ అక్రమ మట్టి వ్యాపారులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. యథేచ్ఛగా రాత్రింబవళ్లు తవ్వకాలు జరుపుతున్నారు. ఏన్కూరు నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అక్రమ మట్టి దందా మూడుపూల ఆరుకాయలుగా కొనసాగుతుంది. దీనిని అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

అనుమతి ఒకచోట..తవ్వకాలు వేరేచోట

మట్టి తవ్వకాల కోసం నామమాత్రంగా మైదానప్రాంతాల్లో అనుమతి తీసుకుని రాత్రి సమయాల్లో నిషేధిత గుట్టలను కొల్లగొడుతున్నారు. ఈగుట్టల ప్రాంతాల్లోని మట్టిని జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తరలించి రూ. కోట్లు గడిస్తున్నారు. సెలవు రోజుల్లో ఆదివారాల్లో నిరంతరాయంగా తవ్వకాలు జరపడం విశేషం. గ్రీన్‌ఫీల్డ్ హైవేకి అనుమతి తీసుకొని ఇష్టం వచ్చిన చోట్ల నిరంతరంగా రాత్రివేళల్లో తవ్వకాలు జరుపుతున్నట్టు ఆరోపణలున్నాయి. కంకర మిల్లుల బ్లాస్టింగ్ వల్ల చుట్టుపక్కల గ్రామాల్లోని ఇండ్లకు పగళ్లు వస్తున్నాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. భారీవాహనాలను రాకపోకలకు రోడ్లు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

» అదనపు కలెక్టర్ శ్రీజ

కారేపల్లి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వ సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్నికల సామాగ్రిని సిబ్బందికి పంపిణీ చేయనున్న గదులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులతో మాట్లాడుతూ విధులు నిర్వహించే ఉద్యోగులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అడిగితెలుసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండానే చూడాలన్నారు.

జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులను చెట్లకింద కుర్చోపెట్టి తరగతులు చెబుతుండడంతో అదనపు కలెక్టర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదులలో ఉంచి పాఠాలు బోధించాలన్నారు. కళాశాలలో పనిచేయని మినరల్‌వాటర్ ప్లాంట్‌ను గమనించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఈసందర్భంగా కళాశాల భవన మరమ్మతులకు ఇతర సదుపాయల కోసం రూ.30లక్షలు నిధులను కేటాయిస్తున్నట్లుగా ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్, తహసీల్దార్ సంపత్‌కుమార్ ఉన్నారు.

ప్రభుత్వం బాధ్యత వహించాలి: ఖాసీం

కొణిజర్ల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మిర్చి ధర పడిపోవటానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అఖిల భారత రైతుకూలి సంఘం జిల్లా నాయకుడు షేక్. ఖాసీం తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గుబ్బగుర్తి గ్రామంలో మిర్చి రైతులను కలుసుకొని మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి మిర్చిని పండిస్తే, అమ్మే సమయానికి ధర సగానికి సగం పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు పెట్టుబడులు కూడా రానిపక్షంలో ఆత్మహత్యలు చేసుకోక ఏమి చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వాలు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యగారి పేటలోని నూతనంగా నిర్మితమమైన శ్రీ సీతారామచంద్రస్వామి వారి త్రెయాహ్నిక ఏక కుండాత్మక ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం 2వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈనెల 7న ప్రతిష్ఠ మహోత్సవం జరుగనుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సకాలంలో పన్నులు వసూలు చేయండి

» మునిసిపల్ కమిషనర్ నర్సింహ



మాట్లాడుతున్న కమిషనర్ నర్సింహ

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీలో పన్నులు సకాలంలో వసూలు చేయాలని కమిషనర్ కొండ్రా నర్సింహ వార్డు ఆఫీసర్లకు సూచించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా బుధవారం ఆయన అధికారులు, వార్డు ఆఫీసర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని, మరమ్మతులను త్వరితగతిన చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని కోరారు. అలాగే పారిశుధ్య నివారణలో భాగంగా వార్డులతోపాటు పట్టణంలోని నాలుగు దిక్కుల రహదారుల వెంట చెత్త లేకుండా చూడాలని, పర్యవేక్షణ లోపం ఉన్నట్లయితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా వ్యాపారులు, గృహ వినియోగదారులు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఉంచి మునిసిపాలిటీ ట్రాక్టర్లలో వేయాలని, అలాకాదని చెత్తను ఎక్కడబడితే అక్కడ వేస్తే జరిమానా విధిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాసరావు, ఏఈ వేముల సురేష్ తదితరులు ఉన్నారు.



గిరిజన గురుకుల ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తున్న జడ్పీ సీఈవో, డీపీవో

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి: జడ్పీ సీఈవో

వైరా, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జడ్పీ సీఈవో దీక్షారైనా అన్నారు. బుధవారం వైరా మండలం ముసలమడుగులో తెలంగాణ ట్రైబల్‌వెల్ఫేర్ గురుకుల పాఠశాలను బుధవారం డీపీవో ఆశాలత, డీఎల్‌పీవో రాంబాబుతో కలిసి పరిశీలించారు. గురుకుల పాఠశాలలోని మెనుబోర్డును, వంటగదిని, స్టోర్‌రూమ్‌లను పరిశీలించిన వారు పాఠశాల నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ఉంటే పాఠశాలలో దుర్వాసన ఎందుకురాదు, మంచిగా లేని కూరగాయలను ఎందుకు తెప్పిస్తున్నారంటూ ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజారంజక బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేపథ్యంలో బుధవారం స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ, మండల కమిటీ అధ్యక్షులు బాణోత్ విజయ్, పాలకొల్లు శ్రీనివాసరావు, మైనార్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు షేక్.రహ్మతుల్లా, నాయకులు మందా శివ, మేరుగు శేషగిరిరావు, కార్తీక్, సందీప్, సాలి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన ఆమోదం పట్ల హర్షం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం పట్ల బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కులగణనతో ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందని, ఎస్సీవర్గీకరణ బిల్లును ఆమోదించి చరిత్రత్మక ఘట్టాన్ని అసెంబ్లీలో నమోదు చేసిందన్నారు ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి,, ఉపాధ్యక్షులు బండారు నర్సింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, పీసీసీ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని విస్మరించిన కేంద్రం

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

కొణిజర్ల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని విస్మరించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. బుధవారం కొణిజర్లలో జరిగిన సీపీఎం మండలకమిటి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణను విస్మరించిన కేంద్రబడ్జెట్ ను సవరించాలని ఈనెల 10న హైదరాబాద్ లో చేపట్టిన మహాధర్నాకు ప్రజలు పెద్ద ఎ త్తున కదిలిరావాలని పిలుపునిచ్చారు. కేంద్రబడ్జెట్‌లో వివిధ రంగాలకు తగినస్థాయిలో నిధు లు కెటాయించలేదన్నారు. సీతారామప్రాజెక్టుకు బడ్జెట్‌లో కనీసం రూపాయి కూడా కెటాయించలేదని విమర్శించారు. బయ్యారం పరిశ్రమ ఏర్పాటు ఊసేలేదన్నారు. ఉమ్మడిరాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీ ఊసేలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, తాళ్ళపల్లి కృష్ణ, మేరుగు రమణ, చెరుకుమల్లి కుటుంబరావు, కొప్పుల కృష్ణయ్య, దొడ్డపునేని కృష్ణార్జునరావు, తాళ్ళపల్లి విజయ, హరిచంద్, దానయ్య, సరోజిని, సత్యనారాయణ, మహబూబ్‌అలీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టూరి సీతారత్నం ఆశయాలు సాధించాలి



సీతారత్నం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు

» ఎమ్మెల్సీ తాతా మధు

కల్లూరు, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగాల గ్రామ మాజీ సర్పంచు మట్టూరి సీతారత్నంకు పలువురు నివాళులర్పించారు. ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు పలువురు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం సీనియర్ నాయకుడు తాత భాస్కరరావు, ఎం. సుబ్బారావు, జిల్లా కమిటీ సభ్యులు మోరపూడి పాండు రంగారావు, జాజిరి శ్రీనివాసరావు, పారుపల్లి ఝాన్సీ, కొండపల్లి పవన్, మాదల వెంకటేశ్వరరావు, తన్నీరు కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఫౌండేషన్ నిర్వాహకుడికి వీడ్కోలు

తల్లాడ, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం వెంగన్నపేటలో గుండెపోటుతో మృతి చెందిన పాఠశాల ఫౌండేషన్ నిర్వాహకుడు కళ్యాణపు సాంబశివరావుకు బుధవారం పలువురు అంతిమ వీడ్కోలు పలికారు. సాంబశివరావు మృతదేహన్ని ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, విద్యాసంస్థల నిర్వాహకులు ముప్వా శ్రీనివాసరావు, మల్లెంపాటి వీరభద్రరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

అల్పాహారం అందజేత



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

కల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారానికి బుధవారం స్ఫూర్తి ఫౌండేషన్ తరుపున రూ.40 వేలు వితరణ చేశారు. ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా స్టడీ అవర్స్ నిర్వహించే క్రమంలో తరగతిలో విద్యార్థులకు ఈ అల్పాహారం అందించడం జరుగుతుందని పాఠశాల హెచ్ఎం వాసిరెడ్డి పద్మ తెలిపారు. స్ఫూర్తి ఫౌండేషన్ తరుపున ప్రతినిధి వరక రామారావు ద్వారా రూ. 40 వేల విలువ గల పౌష్టిక ఆహారాన్ని అందించారు. దాతలకు పాఠశాల తరుపున హెచ్ఎం పద్మ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, ఎం వెంకటేశ్వరావు, అనితకుమారి, పణిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

» సైబర్‌క్రైమ్ డీఎస్పీ ఫణిధర్

కొణిజర్ల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్‌క్రైమ్ డీఎస్పీ ఫణిధర్ సూచించారు. స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సైబర్ భద్రత, ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ మోసాలు రోజు రోజుకు పెరుగతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఎస్ఐ విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ చిన్నయ్య, వైస్‌ప్రిన్సిపాల్ ఆయేషాతారణం, డీన్ శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఆఫీసర్ పరీద్‌బాబా తదితరులున్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ఫణిధర్

నిధుల మంజూరు పట్ల హర్షం



మాట్లాడుతున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు మంజుల

కారేపల్లి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న బీటీ రోడ్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ నిధులు మంజూరు చేయడంపట్ల బుధవారం మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. గిద్దవారిగూడెంలో మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు చాయదేవి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్రకాంగ్రెస్ నా యకురాలు మంజుల మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల వితరణ

ఎర్రుపాలెం, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు పా ఠశాలకు డెస్క్ బెంచీలను బుధవారం వితరణగా అందించారు. గ్రామానికి చెందిన ముల్లంగి రమేష్, గద్దల కిరణ్ ఇండియన్ ఆర్మీ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో జవాన్లుగా విధులు నిర్వహిస్తున్నారు. సుమారు రూ.50వేలు విలువగల జీవి డెస్క్ బెంచీలను పాఠశాల హెచ్ఎం నాగులవంచ జ్యోతికి అందించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు వేములపల్లి బాలకృష్ణ, వీరమాచినేని వత్సలదేవి, పద్మ, సోమలక్ష్మి, యాకోబు, తిరుమల, సుమలత, కాకుమాను లక్ష్మి, గ్రామస్తులు ముల్లంగి గాబ్రియేలు, లాజర్, గద్దల రాజశేఖర్,మనిపోగు శ్రీనివాస రావు, గద్దల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



వితరణ చేసిన బెంచీలతో పాఠశాల విద్యార్థులు


లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

మధిరటౌన్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌ను రద్దు చేసి ఆర్టీసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎస్‌డబ్ల్యూయూ ఆధ్వర్యంలో బుధవారం మధిర ఆర్టీసీ డిపో ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రద్దు చేసిన 26 కార్మిక చట్టాలను వెంటనే పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పద్మావతి, కోటయ్య, నాగరాజు, నాగరాజు, అనూష తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన పోలీసులకు సన్మానం



కానిస్టేబుల్స్‌ను అభినందిస్తున్న సీఐ ముత్తులింగయ్యగౌడ్

పెనుబల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) మూడవ రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు కానిస్టేబుల్స్‌ను సత్తుపల్లి రూరల్ సీఐ ఎల్ ముత్తులింగయ్యగౌడ్ సన్మానించారు. మంగళవారం తన కార్యాలయంలో వీఎం బంజర పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్స్‌గా పనిచేస్తున్న యస్‌కె. మంజిత్‌పాషా, షాట్‌పుట్ విభాగంలో బంగారుపతకం సాధించగా, బి. వెంకటేశ్వర రావు (బీటీఆర్) హ్యాండ్‌బాల్ విభాగంలో కాంస్య పతాకం సాధించారు. అంతకు ముందు రోజు సీపీ కార్యాలయంలో వారిద్దరని అభినందించారు. ఈ కార్యక్రమంలో వీఎం బంజర ఎస్ఐ కె. వెంకటేష్ సిబ్బందిలు పాల్గొన్నారు.

'ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దు'

మధిరటౌన్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ఎడ్లబండ్లతో ఇసుకను తోలుకునే వారు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దని తహసీల్దార్ రాంబాబు అన్నారు. బుధవారం ఎడ్లబండ్లతో ఇసుక తోలుకునే వారితో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతుండటంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తోలుతున్న ఎడ్లబండ్ల యజమానులకు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇసుక విక్రయంపై కలెక్టర్‌తో చర్చిస్తానని, అప్పటి వరకు సొంత అవసరాలకు మాత్రమే ఇసుక తోలుకోవాలని అన్నారు. అలా చేయని వారి బండ్లు సీజ్ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మాట్లాడుత్ను తహసీల్దార్ రాంబాబు